
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 16 డిసెంబరు 2024



కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన, గత ప్రభుత్వం గోదాముల విషయంలో వ్యవహరించిన తీరు ప్రస్తుతం అన్నదాతలకు అది శాపంగా మారింది. మార్కెటింగ్ కమిటీల కింద గోడౌన్‌లను లీజు ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చే ప్రక్రియను గత ఏలుబడిలో చేపట్టారు. మరో వైపు ఆర్బీకేలకు అనుసంధానంగా గోడౌన్‌ల నిర్మాణం అంటూ హడావిడి చేసింది. ఇవి పూర్తి కాకపోగా ఉన్న గోదాములను రైతులకు అక్కరకు రానీయకుండా లీజు పాలు చేసింది.


- పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కరువు
- టైర్లలో గాలి, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సహా 6 రకాల ఉచిత సేవలు
- వాటిని ఏమాత్రం అమలు చేయని బంకు నిర్వాహకులు
- పర్యవేక్షణ, తనిఖీలు కొరవడడంతో నిబంధనలకు తిలోదకాలు
- వినియోగదారుల అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం



గుంటూరు : ఇన్నర్ రింగురోడ్డులోని పెట్రోలు బంకులో పనిచేయని గాలి నింపు యంత్రం

సదుపాయాలేవి?

జిల్లాలో పెట్రోలు బంకుల నిర్వహణ అధ్వానంగా వుంది. కేవలం లాభాలు పొందడం తప్ప వినియోగదారులకు అందించాల్సిన కనీస సేవలు కూడా అందించకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు బంకు నిర్వాహకులు. దీంతో ప్రతిరోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్న పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన కనీస సదుపాయాలు కూడా అందడం లేదు. బంకుల్లో ఇంధనాన్ని విక్రయించడమే కాదని, ఇంధన వినియోగదారులకు పలురకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసినా జిల్లాలో వాటిని పట్టించుకునేవారే లేరు. నిబంధన అమలుకు పూనుకోవాల్సిన అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో వున్న 300కు పైగా పెట్రోలు బంకుల్లో 90 శాతానికి పైగా పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.


గుంటూరు : పట్టాభిపురం మెయిన్ గేటు వద్ద పెట్రోలు బంకులో పనిచేయని గాలిపంపు


గుంటూరు : లాడ్జి సెంటర్లో పక్కన పెట్టిన వాటర్ ట్యాంకు

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. ప్రతీబంకులో గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. కానీ చాలా చోట్ల అవి వుండడం లేదు. ఒక వేళ ఉన్నా వాటిని సక్రమంగా నిర్వహించడం లేదు. నూటికి 90 చోట్ల అవి పనిచేయని స్థితిలోనే ఉన్నాయంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే చెప్పవచ్చు. గాలి పంపుల నిర్వహణకు ఒక ఉద్యోగిని ప్రత్యేకంగా కేటాయించాల్సి వస్తుండడంతో ఆ సేవను పూర్తిగా నిలిపివేస్తున్నారు. జిల్లా కేంద్రం సహా పలు నగరాలు, పట్టణాల్లో ఉండే పెట్రోలు బంకుల్లో ఇదే పరిస్థితి. శివారు ప్రాంతాల్లోని బంకుల్లోకి లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు వస్తుంటాయి. వాటికి కూడా గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. చాలాచోట్ల యంత్రాలు కనిపించకుండా ఏర్పాటు చేసి వాడకుండా వదిలేస్తున్నారు. చాలా చోట్ల బలవంతగా డబ్బు వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి టైరుకు రూ.5 నుంచి 10, కార్లు, ఇతర భారీ వాహనాలకు టైరుకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. నిర్వాహకులపై భారం పడకుండా ఇంధన సంస్థలే గాలి యంత్రాలను ఏర్పాటు చేసినా నిర్వాహకులు ఇలా చేయడం దారుణం.

● మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

ప్రతీ పెట్రోలు బంకులో మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. చాలామంది బంకుల నిర్వాహకులు వాటిని నిర్వహించడం లేదు. చాలా చోట్ల మూత్రశాలల బోర్డులు పెట్టి సరిపుచ్చారు. ఒక వేళ మరుగుదొడ్లు ఉన్నా వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే పడివుంటున్నాయి. చాలాబంకుల్లో అవి సిబ్బంది కోసమే అన్నట్లు ఇతరులను అనుమతించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సదుపాయం (మిగతా 6వ పేజీలో)

పంట నిల్వ ఎలా

- గత ప్రభుత్వ పాపం...రైతులకు శాపం...!
- ప్రైవేటు వ్యక్తుల చేతిలో మార్కెట్ యార్డు గోదాములు
- అక్కరకు రాని బహుళ ప్రయోజన గోడౌన్‌లు
- ఆర్‌బీకేల పరిధిలో గోదాములంటూ గతంలో హడావిడి
- అయినకాడికి పంటను అమ్ముకుని నష్టపోతున్న రైతులు


పిచ్చి మొక్కలకు నిలయంగా మారిన కర్లపాలెం గ్రామంలో నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బహుళ ప్రయోజన సౌకర్యాల కోసం గోదాముల నిర్మాణాన్ని గత ప్రభుత్వం చేపట్టింది. వీటిలో చాలా వరకు నిర్మాణాలను అసంపూర్తిగానే వదిలేసింది. అరకొరగా పూర్తయిన వాటిని కూడా రైతులకు అందుబాటులోకి తేవడంలో వహించిన నిర్లక్ష్యం ప్రస్తుతం రైతులకు శాపంగా మారిన దుస్థితి నెలకొంది. ప్రకృతి విపత్తుల సమయంలో చేతికొచ్చిన పైరును నిల్వ చేసుకునే వెసులుబాటు లేక అయినకాడికి అమ్ముకోవాల్సిన దీనస్థితిని గతంలో ఎదుర్కొన్నారు. ప్రస్తుతం దానిని చక్కదిద్దే పనిలో కూటమి పాలకులు ఉన్నప్పటికీ ఐదేళ్ల అలసత్వం తాలుకా ప్రభావం ఇప్పటికీ అన్నదాతలపై పడుతూనే ఉంది. తాజాగా తుఫాన్ హెచ్చరికలతో ధాన్యం రైతులు పంటను నిల్వ చేసుకోవడానికి పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నిల్వ కోసం ప్రైవేటు గోదాములపైనే ఆధారపడిన వారు కొందరైతే ఆ ధర భరించలేని వారు తమ పంటను అయినకాడికి అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారు. అస్తవ్యస్తమయిన గోదాముల వ్యవస్థను గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. దానిలో భాగంగా తొలుత గత ప్రభుత్వంలో గోడౌన్‌ల లీజు ఒప్పందాలను పునఃపరిశీలించి వాటిని రద్దు చేసే యోచనలో ఉంది. దానితో పాటు అసంపూర్తిగా వదిలేసిన బహుళ ప్రయోజన గోడౌన్‌లను త్వరితగతిన పూర్తి చేసి గత ప్రభుత్వ పాపాలను ప్రక్షాళన చేసే పనిలో అధికారులు నిమగ్నమయి ఉన్నారు

బాపట్ల జిల్లాలో మొత్తం 43 గోదాములకు అనుమతులు మంజూరు కాగా వీటిలో నిర్మించినది 20 మాత్రమే కాగా మిగిలినవి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక గుంటూరు జిల్లాలో 30 గోదాముల నిర్మాణానికి అనుమతులు రాగా పూర్తయింది 22 మాత్రమే. పల్నాడు జిల్లాలో 47 మంజూరు కాగా నిర్మాణం పూర్తయింది 23గా ఉన్నాయి.


అలా వదిలేశారు....

పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్‌లు అన్నదాతలకు అక్కరకు రాకుండాపోయాయి. పూర్తి అయిన గోదాములను అన్నదాతలకు అందుబాటులోకి తేవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో అవి ఇప్పుడు పిచ్చిమొక్కలకు ఆవాసాలుగా మారి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇక వివిధ దశల్లో నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న వాటి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇప్పటికే లక్షల రూపాయల ప్రజాధనం వాటిపై వెచ్చించినప్పటికీ నిర్మాణాల విషయంలో తగు జాగ్రత్తలు (మిగతా 6వ పేజీలో)

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి జింకానా సేవలు అపూర్వం 6

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మిర్చియార్డులో మళ్లీ కొత్త లైసెన్సుల గోల



- నేతల ఒత్తిళ్లతో గుట్టుచప్పుడు కాకుండా అధికారుల కసరత్తు
- ఇప్పటికే కొన్ని దరఖాస్తులు ఉన్నతాధికారులకు నివేదన



ఎన్టీఆర్ విగ్రహం రాజధానికే రాజసం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ 6




నాడు - నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలే మార్చేశామని గత వైసీపీ ప్రభుత్వం నేటికీ డప్పు కొడుతున్నది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని స్కూళ్లలో ఏ ఒక్కదానికి ఫైవ్‌స్టార్ రేటింగ్ రాకపోవడం ఆ ప్రోగ్రాంలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నది. కేవలం బ్లాక్‌బోర్డులు, బెంచీలు, అరకొరగా తరగతిగదులు, ప్రహరీ గోడలకే కోట్లాది రూపాయలు దుబారాగా వెచ్చించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అకడమిక్‌లో అయితే మరీ అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- 2, 3 స్టార్‌లలోనే చాలా పాఠశాలలు
- అకడమిక్‌లో అయితే మరీ అధ్వానం

ఫైవ్ స్టార్‌లో.. ఒక్కటీ లేదు!

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 18 సూచికలతో స్టార్ రేటింగ్స్‌ని పాఠశాలలకు ఇవ్వగా మూడు జిల్లాల్లోని స్కూళ్లు 2, 3 స్టార్‌ల్లోనే నిలిచాయి. తరగతి గదుల్లో అవసరమైన మంచి వాతావరణం, ప్రహరీగోడ, ఎలక్ట్రికల్, సోలార్ పరికరాలు, నీటి సౌకర్యంతో వేర్వేరు టాయిలెట్స్, ఆర్వో వాటర్ ప్లాంట్, తగిన వనరులతో లైబ్రరీ రూం, ఆటస్థలం, డస్టుబిన్‌లు, అన్ని తరగతి గదులకు ఫర్నీచర్, పూర్తిస్థాయి పరికరాలతో ల్యాబ్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కలిగిన క్లాస్‌రూంలు, వినియోగంలో ఉన్న స్మార్ట్‌టీవీ/ఇంటరాక్టివ్ ప్యానెల్స్, పంక్షనల్ కంప్యూటర్ ల్యాబ్‌లు, వంటగదులు, వొకేషనల్ సదుపాయాలు, కిచెన్ గార్డెన్, ర్యాంపులు, ఈకంటెంట్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని సున్నా నుంచి మొదలుకొని 5 వరకు స్టార్ రేటింగ్స్‌ని ప్రభుత్వం ఇచ్చింది.



గుంటూరు జిల్లాలో మొత్తం 1062 పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో ఒక్కటి కూడా లేదు. ఒన్ స్టార్‌లో 18, 2 స్టార్‌లో 293, త్రీస్టార్‌లో 510, 4 స్టార్‌లో 241 స్కూళ్లు స్థానం దక్కించుకొన్నాయి. బాపట్ల జిల్లాలో 1,431 స్కూళ్లకు ఒన్‌స్టార్‌లో 79, 2 స్టార్‌లో 606, త్రీస్టార్‌లో 581, ఫోర్‌స్టార్‌లో 165 పాఠశాలలకు రేటింగ్ లభించింది. పల్నాడు జిల్లాలో 1,581 స్కూళ్లకు ఒన్ స్టార్‌లో 11, 2 స్టార్‌లో 310, త్రీ స్టార్‌లో 842, ఫోర్ స్టార్‌లో 418 రేటింగ్స్ పొందాయి.

ఇదేవిధంగా అకడమిక్ పరంగానూ స్టార్ రేటింగ్స్ ఇచ్చారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల అటెండెన్స్, ఎస్ఎస్‌సీ రిజల్ట్స్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఫలితాల ఆధారంగా రేటింగ్స్ ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 0 స్టార్ రేటింగ్‌లో కూడా రెండు స్కూల్స్ వచ్చాయి. ఒన్‌స్టార్‌లో 339, టూ స్టార్‌లో 639, త్రీ స్టార్‌లో 79, ఫోర్ స్టార్‌లో కేవలం మూడు మాత్రమే వచ్చాయి. ఫైవ్‌స్టార్ అనేది ఏ ఒక్క స్కూల్‌కి రాలేదు. పల్నాడు జిల్లాలో అయితే 10 స్కూళ్లకు సున్న రేటింగ్ వచ్చింది. ఒన్‌స్టార్ 569, టూస్టార్ 911, త్రీస్టార్ 89, ఫోర్ స్టార్ రెండు వచ్చాయి. బాపట్ల జిల్లాలో సున్నా స్టార్ 15, ఒన్ స్టార్ 452, టూస్టార్ 801, త్రీస్టార్ 163 రాగా ఫోర్, ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఏ ఒక్క స్కూల్‌కి రాలేదు. దీనిని బట్టి అకడమిక్‌లో ఏ కోశాన పురోగతి సాధించలేదని స్పష్టమవుతున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు టోఫెల్ కరిక్యులమ్ విద్యా బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ అంటూ రూ. కోట్లు దుబారాగా ఖర్చు చేశారు. బైజూస్ కంటెంట్ అనే పేరుతో మరి కొంత ప్రజాధనాన్ని బూడిదలో పోశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అకడమిక్ పరంగా స్కూళ్లల్లో స్టార్ రేటింగ్స్ పెంచేందుకు ఐదు సూత్రాలను సూచించింది. ప్రధానంగా ఎక్కడైతే విద్యార్థులు 10 మంది కంటే తక్కువగా పాఠశాలల్లో ఉన్నారో అక్కడ వారి సంఖ్య పెంచాలని సూచించింది. అలానే విద్యార్థులు, ఉపాధ్యాయులు 80 శాతం హాజరు ఉండాలి. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ స్కోరింగ్ చేస్తున్నారో వారిని గుర్తించి అదనపు తరగతులు నిర్వహించాలి. హెచ్ఎంలతో నెలవారీ సమీక్షలు నిర్వహించి ఎక్కడైతే లోపాలున్నాయో గుర్తించి వాటిని సవరించాలి. మండలస్థాయి అధికారులు తరచుగా పాఠశాలలను సందర్శించి వీక్లీ రిపోర్టులు నివేదించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది.

బీఎఫ్ఏ మూడేళ్లేనంట..!

- నాలుగేళ్ల కోర్సును మూడేళ్లలోనే ముగిస్తున్నవైనం
- వార్షిక విద్యా ప్రణాళికలో లోపమే ప్రధాన కారణం
- ఇప్పటికీ అందని ఫీజు రీయింబర్స్ మెంట్

పెదకాకాని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ(ఏఎన్‌యూ) ఉన్నతాధికారుల పని తీరు ఎప్పటికప్పుడు వివాదాలకు దారితీస్తోంది. ఇటీవల వర్సిటీలో విద్యార్థుల వసతి గృహాలలో నాణ్యత లేని భోజనాన్ని వడ్డించి విద్యార్థుల ఆగ్రహావేశాలకులోనైన వర్సిటీ యంత్రాంగం మరో వివాదానికి తెరలేపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, బీఎఫ్ఏ(ఫైన్ ఆర్ట్స్) వంటి 4 సంవత్సరాల నిడివి కలిగిన అన్ని కోర్సుల విద్యాభ్యాసం మార్చి, ఏప్రిల్ మాసాలలో పూర్తవుతున్నది. కానీ ఏఎన్‌యూలో మాత్రం జనవరి మాసంలోనే వార్షిక విద్యా సంవత్సరం ముగిసేలా అకడమిక్ క్యాలెండర్ (వార్షిక విద్యా ప్రణాళిక) రూపొందించడం, అధ్యాపకులంతా అదే పాటించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నాలుగు సంవత్సరాల కోర్సు మూడు సంవత్సరాల లోనే పూర్తయి పోతుండడంతో ఉన్నత విద్యావేత్తలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇతర కోర్సులలో వారందరికీ 3వ సంవత్సరం 1వ సెమిస్టర్ జరుగుతుంటే తమకు మాత్రం 2వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న వైనాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. ఈ నిర్ణయాల ఫలితంగానే ఇటు వర్సిటీ అధికారులకు, ప్రభుత్వానికి చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విభాగ నియమ నిబంధనలకు అనుసంధానం లోపించింది. దీంతో విద్యార్థులకు నేటికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందలేదు. అంతేకాకుండా నాలుగు సంవత్సరాల కోర్సును మూడు సంవత్సరాలలోనే పూర్తి చేస్తే, యూనివర్సిటీ ఇచ్చే సర్టిఫికెట్లు పరిగణలో ఉంటాయా, లేదా అనే మీమాంశ కూడా విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. అంతేకాకుండా, శిల్పకళా శాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక బోధన అంశాలలో సైతం తమకు ఏమాత్రం అవగాహన లేదనీ ఆ శాస్త్రానికి సంబంధించిన కనీస పాఠ్యాంశాలు కూడా బోధించలేదని అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు తగిన విధంగా న్యాయం చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.



ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులకూ తప్పని తిప్పలు

రీయింబర్స్‌మెంట్ విషయంలో ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులూ సమస్య ఎదుర్కొంటున్నారు. ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించారు. కానీ ఆ పోస్టును భర్తీ చేయలేదు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాలంటే ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన థంబ్ ఇంప్రెషన్, సంతకం తప్పని సరి. అది ఇంకా పాత ప్రిన్సిపాల్‌దే నిక్షిప్తమై ఉండడంతో ఆ కళాశాల విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంటు అందడం లేదు. ఈ అంశాన్ని ఆ కళాశాల అధ్యాపకులు పరిపాలనాధికారి దృష్టికి తీసుకువెళ్లగా ఓ మహిళా అధ్యాపకురాలిని "గోప్యంగా ప్రిన్సిపాల్ సంతకం మీరే చేసి, థంబ్ ఇంప్రెషన్ మీది పెట్టండంటూ" అనధికారిక ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. కాగా సదరు అధ్యాపకురాలు ఉన్నతాధికారి నోటిమాటగా చెప్పిన ఆదేశాలను పాటించాలా? వద్దా? అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నట్లు ఆర్కిటెక్చర్ కళాశాల వర్గాలు చెప్పుకుంటున్నాయి.

రాజధానిలో యాదవ భవన నిర్మాణానికి కృషి



ప్రసంగిస్తున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి యాదవ్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో యాదవ భవన నిర్మాణానికి కృషి చేస్తామని, సీఎం చంద్రబాబు నాయుడును ఒప్పించి భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేపిస్తామని, ఈ విషయంలో నా వంతు సహకారం పూర్తిగా ఉంటుందని టీటీడీ పాలక మండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి యాదవ్ తెలిపారు. ఆదివారం గుంటూరులో రాష్ట్ర యాదవ ఉద్యోగుల ఆత్మీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణమూర్తి యాదవ్ మాట్లాడుతూ యాదవ్ ఉద్యోగులందరూ పరస్పరం సహాయ సహకారాలతో ముందుకు సాగాలన్నారు. యాదవ ఉద్యోగులందరూ ఒక గ్రూపుగా ఏర్పడి ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా యాదవ ఉద్యోగులు తోట కోటేశ్వరరావు, సాదం సత్యనారాయణ, జువ్వ జ్ఞానేశ్వరరావు, తాటి సత్యనారాయణ, యలమంద, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మోహన్‌రావు

యాదవ ఉద్యోగుల సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరుకు చెందిన పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తుపాకుల మోహన్‌రావును, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కేవీ కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



రగ్బీ పోటీలను ప్రారంభించిన నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు

ఫిరంగిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని దీనాపూర్ ఆవరణలో ఆర్‌సీజేసీ కళాశాల, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించే పోటీలను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ ఆట ఇతర దేశాల్లో ప్రాచుర్యం పొందిందన్నారు. ఇప్పుడిప్పుడే మన దేశంలో ఈ ఆటకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో సంప్రదించి జాతీయ స్థాయి రగ్బీ ఆటల పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 10వ రగ్బీ అండర్-15 బాల బాలికల పోటీలు రెండు రోజులు జరుగుతాయని, ఇందులో 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని, 16 బాలుర, 14 బాలికల టీమ్‌లు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్ఫ్ సంస్థ సహ వ్యవస్థాపకులు ఎస్. స్వర్ణలతదేవి, కార్ఫ్ డైరెక్టర్ కె.మేరీ, ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, డి.రామాంజనేయులు, వి.కృష్ణారెడ్డి, టి.డానియేలు, ఎంవీ సుబ్బారావు, చుక్కా కొండయ్య, ఆనంద్ విజయ బాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కొత్త లైసెన్సుల గోల

- నేతల ఒత్తిళ్లతో గుట్టుచప్పుడు కాకుండా అధికారుల కసరత్తు
- ఇప్పటికే కొన్ని దరఖాస్తులు ఉన్నతాధికారులకు నివేదన



మిర్చియార్డు

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)లో మళ్లీ కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సుల గోల ప్రారంభమైంది. ఓ వైపు గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో దాదాపుగా రూ.346 కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం ప్రభుత్వానికి నివేదించగా, మరోవైపు అది అదే.. తమ పని తమదేనన్నట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది పాలకవర్గ సభ్యులే నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ ఏజెంట్ లైసెన్సుల కోసం దరఖాస్తులు పెట్టుకోగా అప్పటి మార్కెటింగ్ అధికారులు వాటిని తిరస్కరించారు. ఇప్పుడు యథాతథంగా ఆ దరఖాస్తులను మళ్లీ నివేదించారు. వాటితో పాటు కొంతమంది నేతలు లేఖలు ఇచ్చి లైసెన్సులకు సిఫార్సు చేసిన వారివి కూడా మార్కెటింగ్ శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నామ్‌కే వాస్తేగా..

మిర్చియార్డులో ఇప్పటికే 683 కమీషన్ ఏజంట్ లైసెన్సులున్నాయి. వీళ్లలో 628 మందికి వేలం కేంద్రాల(ప్లాట్ల)ను కేటాయించారు. అయితే మొత్తం కమీషన్ ఏజెంట్లలో మిర్చి సీజన్‌లోనే నెలకు సగటున 50 శాతం మంది కూడా వ్యాపారం చేయడం లేదు. ఇక మిగతా నెలల్లో ఇంకా తక్కువగా వ్యాపారం చేస్తున్నారు. ఈ గణాంకాలను ఇటీవలే వేమెన్ల సంఘం నాయకులు మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు నివేదించారు. వ్యాపారం చేస్తున్న వారిలో కూడా కేవలం 80 నుంచి 90 మంది మాత్రమే ఎక్కువగా టర్నోవర్ చేస్తున్నారు. మిగతా వాళ్లు నామ్‌కే వాస్తేగా లైసెన్సులను పెట్టుకొన్నారు.

అవినీతికి ఆస్కారం ఇక్కడి నుంచే...

మిర్చియార్డులో కమీషన్ ఏజెంట్ లైసెన్సులను కొంతమంది బడా వ్యాపారస్తులు వారి ఆధీనంలో ఉంచుకుంటున్నారు. వ్యాపారం చేసే ఉద్దేశం లేకపోయినా పలుకుబడిని ఉపయోగించి తెచ్చుకొన్న లైసెన్సులను పెద్ద వ్యాపారస్తులు కొనేస్తున్నారు. ఆ తర్వాత ఫరంలో భాగాస్వామ్య మార్పులు చేయించుకొంటున్నారు. ఇలా పార్టనర్‌షిప్ మార్పు చేసినందుకు మార్కెటింగ్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఒక్కో లైసెన్సుకు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇలా పార్టనర్‌షిప్ మార్పులు ఎక్కువ సంఖ్యలో చేయడం వలన రూ.కోట్లు చేతులు మారాయని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. దీనిపై ఇంకా ప్రభుత్వం చర్యలు చేపట్టకముందే మళ్లీ లైసెన్సులు ఇవ్వాలని నేతలు సిఫార్సులు చేస్తుండటం, వాటిని అధికారులు మార్కెటింగ్ రాష్ట్ర శాఖకు నివేదిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

బిల్ టూ బిల్ వ్యాపారాలకు కూడా ఊతం

మిర్చియార్డులో బిల్ టూ బిల్ పేరుతో వ్యాపారం జరుగుతుంది. తగినంత పెట్టుబడి లేకపోయినా పలుకుబడితో లైసెన్సు పొందిన వ్యాపారులు తమ వద్దకు వచ్చిన సరుకుని వేరే ఫరం పేరుతో బిల్లు ఇస్తున్నారు. ఇందుకుగానూ రైతుల నుంచి వసూలు చేసే కమీషన్‌లో చెరొక శాతం పంచుకొంటున్నారు. ఎప్పుడైతే రైతులకు నగదు చెల్లించకుండా బోర్డు తిప్పేస్తారో అప్పుడు ఈ వ్యవహారం బయటకు వస్తుంది. ఎవరిని బాధ్యులను చేయాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా గతంలో అధికారులు నిలిపేసిన 10 కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సుల దరఖాస్తులతో పాటు నేతల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నవి యథాతథంగా మార్కెటింగ్ శాఖకు పంపేందుకు చర్యలు చేపట్టడంపై వీళ్లు మారరు అన్న నానుడి నాటుకుపోతుంది.

సదుపాయాలేవి?

(5వ పేజీ తరువాయి)

దాదాపుగా లేదనే చెప్పాలి. పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతి కూడా ఉండాలి. కానీ నూటికి 90 బంకుల్లో ఈ సదుపాయమే లేదు. వేసవి కాలంలో సైతం కనీసం తాగునీటి సదుపాయాలు కల్పించకుండా నిర్వాహకులు దాటేస్తున్నారు. వాస్తవానికి బంకు నిర్వాహకుడు ఆర్వో యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. కానీ ఎవరూ ఈ నిబంధనను పాటించడం లేదు. వినియోగదారులకు హక్కుగా అందాల్సిన ఆ సౌకర్యం లేకపోవడంతో నీళ్లు కొనుక్కుని దాహం తీర్చుకోవాల్సి వస్తోంది.

- **ఫిర్యాదుల పెట్టె ఏది?**

దాంతోపాటు ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదుల పెట్టె, లేదా రిజిస్టర్ వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి. పలు పెట్రోల్ బంకుల్లో కల్తీపెట్రోల్ అమ్ముతున్నారన్న ఫిర్యాదులు తరుచూ వినపడుతున్నా ఫిర్యాదుల పెట్టె లేకపోవడంతో వినియోగదారులు ఆ సౌకర్యాన్ని వాడుకోలేకపోతున్నారు. దీంతోపాటు ఇంధన నాణ్యతను పరిశీలించుకునే సదుపాయాన్ని కూడా బంకుల్లోనే అందుబాటులో ఉంచాలి. వాటిని కూడా పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో కొన్నింటికి పైకప్పులు కూడా పూర్తిగా లేవు. ఇంధనం నింపుకోవడానికి వచ్చే వాహనదారులు ఎండలో, వానలో ఉండాల్సిన పరిస్థితి పలుచోట్ల కనిపిస్తోంది. వీటితోపాటు రోడ్డు ప్రమాదానికి గురైనవారికి అందుబాటులో ఉండేలా ప్రతి పెట్రోలు బంకులో ఒక ప్రథమ చికిత్స బాక్సు, ఒక టెలిఫోన్ ఉంచాలి. కానీ ఇవేవీ పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడం లేదు.

- **పర్యవేక్షణ, తనిఖీలేవి?**

పెట్రోల్‌బంకుల్లో సేవలపై సంబంధిత అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. తనిఖీలు కూడా చేయడం లేదు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు, ఇంధన సంస్థ అధికారులు తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవచ్చు. నిబంధనలు బేఖాతరు చేసేవారిపై జరిమానా విధించవచ్చు. బంకులను మూసివేయవచ్చు. కానీ గడిచిన ఐదేళ్లలో అలాంటి దాఖలాలు మచ్చుకు కూడా లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతైనా మార్పు వస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

- **అవగాహనాలేమి.. అధికారుల బాధ్యత**

పెట్రోల్‌బంకుల్లో విధిగా కల్పించాల్సిన సౌకర్యాలపై వినియోగదారులకు ఎవరికీ ఏమీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాలు వినియోగదారులకు తెలిసేలా ప్రభుత్వంగానీ, సంబంధిత అధికారులుగానీ కనీస చర్యలు తీసుకోకపోవడంతో వినియోగదారులు తమకు హక్కుగా రావాల్సిన సౌకర్యాలన్నింటినీ కోల్పోతున్నారు. వాస్తవానికి ఈ సౌకర్యాల కల్పనకు నిర్వాహకులు సొంత డబ్బులు ఖర్చు పెట్టేదేమీ ఉండదు. అది వినియోగదారుల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసేదే. లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌కు వినియోగదారుడు పెట్రోల్ బంకుల వారికి 4 నుంచి 6 పైసలు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాడు. సగటున ఒక పెట్రోల్ బంకులో రోజుకు 10వేల లీటర్ల చమురు అమ్మితే టాయిలెట్స్ నిర్వహణ వ్యయం కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ. 500 కంటే ఎక్కువే ఉంటుంది. ఆ డబ్బుతో టాయిలెట్, మంచినీరు ఇతర సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత పెట్రోల్ బంకులదే.

ఎన్టీఆర్ విగ్రహం రాజధానికే రాజసం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హాజరైన జనం

తుళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహానగరంలో దివంగత ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరించటం ఎంతో ఆనందంగా ఉందనీ, ఎన్టీఆర్ విగ్రహం రాజధానికే రాజసం అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రం తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్‌లో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. టీడీపీ కూటమి నేతల ఆధ్వర్యంలో కొత్తూరు సెంటర్ నుంచి నాయకులు కార్యకర్తలు బైకులు, ట్రాక్టర్లు, ఆటోలతో ఎంపీ, ఎమ్మెల్యే రథం ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ముందు పెమ్మసాని, ఎమ్మెల్యేకి క్రేన్ సాయంతో గజమాలను వేసి కూటమి నాయకులు సత్కరించారు. అనంతరం బహిరంగ సభలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు పారుతున్నాయన్నారు. రాజధాని అమరావతిలోకి దేశ విదేశాలు, రాష్ట్రాల నుంచి వస్తారని, వారిని గౌరవించి అభిమానించి రాజధానిని సుస్థిరం చేసుకుందామని పార్టీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య, ఆర్డీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, అమరావతి రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు పాల్గొన్నారు.

పంట నిల్వ ఎలా

(5వ పేజీ తరువాయి)

తీసుకోకపోవడంతో పాటు ఈ దుస్థితి తలెత్తిందనేది తెలుస్తోంది

ఆదరాబాదరా నిర్ణయాలు..

గత ప్రభుత్వంలో ఆలోచన వచ్చిందే తడవుగా పాలకుల నోట్లో నుంచి ప్రకటన వచ్చేది. వాటి సాధ్యాసాధ్యాల విషయంలో తగినంత కసరత్తు కానీ వివిధ శాఖల మధ్య సమన్వయం, వాటి పాత్ర వంటి వాటి గురించి శ్రద్ధ పెట్టిన పాపాన పోలేదు. ఈ గోదాముల నిర్మాణం విషయంలో మార్కెటింగ్ విభాగానికి, పీఏసీఎస్‌లకు మెలిక పెట్టడం కూడా ప్రతిబంధకంగా మారింది. ఎంపిక చేసిన గోదాముల నిర్మాణాన్ని పూర్తి చేసి వాటిని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధీనంలో రైతులకు ఇవ్వాలనేది గత ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలలో ఉన్నాయి. కానీ ఆచరణలో ఆ రెండు విభాగాల మధ్య సరైన సమన్వయం లోపించడం కూడా అన్నదాతల నిల్వ ఇక్కట్లకు కారణాలుగా ఉన్నాయి. మంజూరైన గోడౌన్‌లలో దాదాపు 65 శాతం పూర్తి అయినప్పటికీ వాటిని అన్నదాతలకు అందుబాటులోకి తేవడంలో గత ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సత్వరమే రైతులకు ఉపయోగం లోకి తేవాలన్న వైసీపీ ప్రభుత్వంలో అనేక సాంకేతిక పరమైన చిక్కులను వాటి నిర్మాణంలో పొందుపరచడంతో వాటన్నింటిని పరిష్కరించి అందుబాటులోకి తేవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది

ఉన్న గోదాములను లీజుకు....

మార్కెట్ కమిటీల పరిధిలో ఉండే గోదాములను లీజుకిచ్చే తంతు గత ప్రభుత్వంలో నడిచింది. బాపట్ల జిల్లాలో 66 మార్కెటింగ్ విభాగం కింద 66 గోడౌన్‌ల ఉండగా వీటిలో 20 వరకు ఎప్పటి నుంచో ఎఫ్‌సీఐ, డీసీఎంఎస్ విభాగాలు అద్దె ప్రాతిపదికన వాడుకుంటుండగా, మిగిలిన వాటిని కూడా ప్రైవేటు వ్యక్తులకు గత ప్రభుత్వంలో లీజుకిచ్చారు. దాదాపు 20 వరకు బాపట్ల జిల్లాలో ఇవ్వగా, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 50 వరకు గోదాములను ఇతరత్రా అవసరాలకు నామమాత్రపు ధరకు లీజుకిచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టారు. ఓ వైపు రైతుభరోసా కేంద్రాల పరిధిలో గోడౌన్‌ల నిర్మాణమంటూ మరో వైపు ఉన్న వాటిని ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చే నిర్ణయాల పట్ల అప్పటి ప్రతిపక్షం టీడీపీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే లీజు గడువు ఉన్నప్పటికీ చాలా మంది ప్రైవేటు వ్యక్తులు గోడౌన్‌లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఉన్న పళంగా వాటిని స్వాధీనం చేసుకుని తిరిగి రైతులకు నిల్వ కోసం ఇవ్వడానికి సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురవుతుండడంతో త్వరలోనే అన్ని గోదాములను అన్నదాతలు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి అందుబాటులోకి తేనున్నారు

నిల్వకు ఖర్చు పెట్టే పరిస్థితిలో రైతులు లేరు....

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధిక ధర చెల్లించి ప్రైవేటు గోడౌన్‌లలో తమ పంటను నిల్వ చేసుకునే ఆర్థిక వెసులుబాటు రైతులకు లేకపోవడంతో అయినకాడికి తమ ఉత్పత్తులను అమ్ముకుని నష్టపోతున్నారు. తాజాగా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని వరి రైతులు తమ పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక నానా ఇబ్బందులు పడిన సంగతి విదితమే. దాదాపు పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం దళారుల పాలు కావడం వెనక అన్నదాతలకు నిల్వ సౌకర్యం లేకపోవడమే కారణంగా ఉంది. ఇప్పటికైనా జిల్లాలో మార్కెటింగ్ శాఖ పరిధిలో ఉన్న గోడౌన్లను నామమాత్రపు అద్దెతో రైతులు ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టడంతో పాటు నిర్మాణం పూర్తయిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను సైతం తమకు అందుబాటులోకి తెస్తేనే నిల్వ కష్టాల నుంచి గట్టెక్కుతామనే అభిప్రాయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా రైతాంగం వెలిబుచ్చుతోంది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



దరఖాస్తులను ఆవిష్కరిస్తున్న కమ్మజన సేవా సమితి పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ తెలిపారు. గుంటూరు, కుందుల రోడ్డులోని బాలికల వసతి గృహంలో ఆదివారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 2024 పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన బాలికలు ఈ ఉపకార వేతనాలకు అర్హులన్నారు. గ్రామీణ బాలికల్లో విద్యను ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు అందించే కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. 2024 పది పరీక్షల్లో 480, అంతకంటే ఎక్కువ మార్కులు, 420 మార్కులు సాధించిన దివ్యాంగులు, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన వారు ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు సమితి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 0863 2260666, 2355471 నంబర్లను సంప్రదించాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్యచౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, మద్రిపూడి సీతారామయ్య పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



అమ్మవారికి నూతన వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

గురజాలటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని, నూతన వస్త్రాలను అందించి, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యే యరపతినేనికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే యరపతినేని వెంట కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, డీఎస్పీ హనుమంతురావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి జింకానా సేవలు అపూర్వం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో మరెక్కడా లేని విధంగా గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధికి ఉత్తర అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు (జింకానా) అందిస్తున్న సేవలు అపూర్వమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. ఆదివారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి పొదిల ప్రసాద్ జింకానా సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌పై రూ.10 కోట్ల వ్యయంతో తలపెట్టిన రెండు అదనపు అంతస్తుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. జింకానా సభ్యుడు, ఎన్నారై డాక్టర్ పొదిల ప్రసాద్ వ్యక్తిగతంగా రూ.2.50 కోట్లు విరాళం అందించగా, మిగిలిన మొత్తాన్ని జింకానా సమకూరుస్తోంది. ఈ సందర్భంగా జరిగిన సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఇక్కడ వైద్య విద్యను అభ్యసించి అమెరికాలో స్థిరపడిన డాక్టర్ పొదిల ప్రసాద్ భారీ విరాళం అందించడంతో పొదిల జింకానా సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పేద రోగులకు సమకూరిందని తెలిపారు. రూ.100 కోట్ల వితరణతో జింకాన చేపట్టిన మాతృ శిశు సంరక్షణ విభాగం శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్నట్లు తెలిపారు.

మాతృ సంస్థకు ఎంత చేసినా తక్కువే: పొదిల

దాత డాక్టర్ పొదిల ప్రసాద్ మాట్లాడుతూ కన్నతల్లికి, జన్మభూమికి ఏమి ఇచ్చినా రుణం తీరదన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాన దాత డాక్టర్ పొదిల ప్రసాద్‌ను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని ఘనంగా సత్కరించారు. నర్సరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారీ, ప్రభుత్వ ఛాతి వ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘు, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, జింకానా బిల్డింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సాగిరెడ్డి బాబురెడ్డి, నాట్కో వైస్ ఛైర్మన్ నన్నపనేని సదాశివరావు, జీజీహెచ్ అభివృద్ధి సంఘం సభ్యులు తులసి రామచంద్ర ప్రభు, ఏపీ పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ ఎల్ఐడీసీ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ముగిసిన కాడెరిక్ వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న ప్రముఖ వైద్యులు

మంగళగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో రేడియో డయాగ్నోసిస్, అనాటమీ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన ఇమేజ్ గైడెడ్ మస్క్యులో స్కెలెటల్ ఇంటర్వెన్షన్‌లపై కాడెరిక్ వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్, ది మస్క్యులో స్కెలెటల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 80 మంది ప్రముఖ వైద్యులు, వివిధ దేశాల నుంచి పది మంది అధ్యాపకులు హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. అత్యాధునిక ఎంఎస్‌కే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్, అకడమిక్స్ డీన్ డాక్టర్ శ్రీమంత్‌కుమార్ దాస్, ఐఆర్ఐఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ జైరాజ్, డాక్టర్ జాయ్ ఘోషల్, డాక్టర్ పృథ్వీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మిథిలేష్, కిషోర్, చైతన్య, భావన తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో ఈత వేస్తూ విద్యార్థి గల్లంతు

మేడికొండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థి నీటికుంటలో పడి ఆదివారం గల్లంతయ్యాడు. మేడికొండూరు సీఐ తెలిపిన వివరాల మేరకు.. తెనాలికి చెందిన మూల్పూరు రంజిత్ (21) భీమినేనివారిపాలెంలో అద్దెకు ఉంటూ స్థానిక బీఫార్మసీ కళాశాలలో చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో సాయంత్రం 5 గంటల సమయంలో టిఫిన్ చేయడానికి సహచర విద్యార్థులతో కలిసి కళాశాల ముందుగా వెళ్తుండగా, కళాశాలలో పనిచేస్తున్న మోటార్ మెకానిక్ వీరిని పిలిచాడు. కళాశాల తూర్పు వైపున ఉన్న కుంటలోని మోటార్ పనిచేయడం లేదని చూద్దాం రమ్మని కోరాడు. దీంతో రంజిత్‌తోపాటు పది మంది విద్యార్థులు కుంట వద్దకు వెళ్లారు. మెకానిక్ మోటార్ బయటకు తీసి రిపేరు చేస్తుండగా రంజిత్ కుంటలో ఈతకు దిగాడు. అందరూ చూస్తుండగానే నీటిలో మునిగిపోయాడు. బయటకు రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం గాలింపు చేపడతామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండటౌన్, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం చిన్నతురకపాలెం గ్రామానికి చెందిన షేక్ మదార్ షైదావలి (55) ద్విచక్ర వాహనంపై శ్రీశైలం ప్రయాణిస్తూ వైపు వెళ్తుండగా, మార్కాపురం నుంచి వినుకొండ వస్తున్న కారు ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

గేయానికి హృదయం...లయ

● సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గేయానికి హృదయం లయ అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు తెలిపారు. స్థానిక బ్రాడీపేట లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ) సమావేశ మందిరంలో ఆది వారం అమరావతి సాహితీమిత్రులు నిర్వహించిన సాహిత్య సమావేశంలో ఆయన 'గేయాలు ఎలా రాయాలి' అనే అంశంపై ప్రసంగించారు. ప్రజా సమస్యలపై గేయాలు విరివిగా రాయాలని ఆయన కవులకు పిలుపు నిచ్చారు. పెనుమాక నాగేశ్వరరావు రాసిన కథల సంపుటి 'అమర సుఖం' గురించి వక్కలగడ్డ వెంకటేశ్వరరావు సోదాహరణంగా ప్రసంగించారు. మేడిశెట్టి యోగేశ్వర రావు (మచిలీపట్నం) 'ఈ మాసం కవి'గా పాల్గొని అనేక గేయాలు వినిపించి సభను రంజింప చేశారు. 'నిక్కచ్చికవిత' సత్కారం కోసం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో 'డస్ట్ బిన్' అనే అంశంపై పలు వురు కవులు పాల్గొన్నారు. 'నిక్కచ్చి కవిత' సత్కారానికి ఎంపికైన చల్లా సత్యవతికి శాంతశ్రీ ట్రస్ట్ వారు రూ.500 నగదు బహుమతిని అందజేశారు. అమరావతి సాహితీమిత్రులు సంస్థ నిర్వహించిన కవితల పోటీలలో విజేత లైన సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), సూర్యదేవర రవి కుమార్ (గుంటూరు), టి లీలా కృష్ణ (తెనాలి), 'నిక్కచ్చి కవిత' విజేత చల్లా సత్యవతి అమ రావతి సాహితీమిత్రుల సత్కారం అందు కున్నారు. కార్యక్రమంలో ఈ చంద్రయ్య పాల్గొన్నారు.

డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి వేడుకలు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉద యం 10 గంటలకు స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్ఫూర్తి ప్రదాత, విజయ నగరం మహారాజా డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన టీటీడీ బోర్డు సభ్యుడు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యుడు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ నన్నప నేని సదాశివరావు, డాక్టర్ పొదిలి ప్రసాద్, నాట్కో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ ఆదివారం సందర్శించారు. తొలుత వారికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(విద్య),డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ గుంటూరు యూనిట్ ఎన్నికలు ఆదివారం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని కృషీ భవన్‌లో నిర్వహిం చారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఉద్యోగులు యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శశిభూషణ్ యాదవ్, జోనల్ సెక్రటరీ రవీంద్ర హాజరయ్యారు.

అలరించిన సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై గుంటూరు కళాంజలి సుమధుర సంగీత విభావరి ఆదివారం జరిగింది. గాయనీ, గాయకులు ఎం సత్యవర్ధన్, టీ సుధీర్, ఏ సాంబశివరావు, టీ రమేష్, పీ గాయత్రిలు అలనాటి సినీ, భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ రేట్లు పెంచి ప్రజలను మోసం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలోనే రూ.15,486 కోట్ల భారం వేసిందన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక బ్రాడీపేటలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు(విద్య),డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేద లకు పెన్షన్లు, నూతన వస్త్రములు పంపిణీ చేశారు. అవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి చంద్ర భాస్కరరావు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పెన్షన్, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. మట్టుపల్లి రవికుమార్ సహకారంతో ఒక పేద విద్యార్థినికి సైకిల్, మరో పేద విద్యార్థినికి కాలేజీ ఫీజు కింద రూ. 12 వేలు అందజేశారు. ఈ కార్య క్రమంలో అరవపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్ పాల్గొన్నారు.

పోరాటానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు : కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టుదల, పోరాటానికి ప్రతిరూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని గ్రామీణ అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అమరజీవి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దళితులను దేవాలయాల్లోకి రానివ్వని రోజుల్లో మొదటి పోరాటాన్ని ప్రారంభించిన నాయకుడు పొట్టిశ్రీరాములు అని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం, తెలుగుజాతి కోసం 56 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర వంటి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడయ్యాడని అన్నారు. పొట్టి శ్రీరాములు మరణించినాగానీ ఆయన రగిలించిన స్ఫూర్తి అందరిలో నెలకొని ఉందని, సమస్యలకు పరిష్కారం తెచ్చే వరకు ఆయన పోరాట పటిమ ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, టీడీపీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు డాక్టర్ శెనక్కాయల ఉమాశంకర్, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, కార్పొరేటరు సమత, ముత్తినేని రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీలో..

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన పొట్టిశ్రీరాములు తెలుగు ప్రజలకు నిత్య చిరస్మరణీయులని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ .హనుమంతు, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వైసీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఆది వారం ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), గుంటూరు తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పలువురు నాయకులు హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మిర్చి యార్డు మాజీ



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, డైమండ్‌బాబు తదితరులు



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నాయకులు అంగడి శ్రీనివాసరావు, కందుల సిద్ధయ్య, పూనూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి, రాజన్న మాష్టారు, రామచంద్రరావు, కేశవరెడ్డి, జేఆర్ నాయుడు, టీవీ రామారావు ఉన్నారు.



వీవీఐటీలో జరిగిన ఏపీ ఏఐ స్కిల్ హబ్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్, సంస్థ చైర్మన్ విద్యాసాగర్

ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ స్కిల్ హబ్‌గా రూపొందించడమే లక్ష్యం

పెదకాకాని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ హబ్‌గా రూపొందిం చడమే లక్ష్యం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గూగుల్ డెవలపర్స్ గ్రూప్ నిర్వహించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్లింగ్ మొదటి వర్క్‌షాప్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో విద్యార్థులకు, అధ్యాపకులకు 'బిల్డ్ ఏఐ అప్లికేషన్స్ అండ్ డిజైన్స్' పై అవగాహన కలిగించనున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగువాళ్లు ముందంజలో ఉండే విధంగా భవిష్యత్ తరాల సాంకేతికతను అందిపుచ్చు కోవాలని అన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు మెరుగైన ఉపాధి అందిపుచ్చు కునేలా కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని, అందులో భాగంగా మరిన్ని సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ దేశంలో తొలిసారి గూగుల్ కోడ్ ల్యాబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో వీవీఐటీలో నెలకొల్పడం, అదేవిధంగా తొలి గూగుల్ స్కిల్లింగ్ వర్క్ షాప్ ను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు అధునిక సాంకేతికతను అందించడంతో వీవీఐటీ ముందుటుందని, విద్యార్థులకు మంచి చేసేందుకు ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా సహకరిస్తామని అన్నారు. ప్రోగ్రామ్ మేనేజర్, డెవలపర్ రిలేషన్స్ గూగుల్ యాక్సిలరేటర్ హెడ్ ,గూగుల్ ఇండియా. పాల్ రంద్ర నాథ్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ సాంకేతిక పురోగతిని విద్యార్థులకు. డెవలపర్స్‌కు అందించడంలో ఈ కార్యక్రమం కీలక భూమిక పోషిస్తుందన్నారు.

ఫిబ్రవరి 16న జాతీయ చిత్రలేఖన పోటీలు, ప్రదర్శన

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి నిర్వహిస్తున్న 19 వ జాతీయ చిత్రలేఖన పోటీలు, ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం వచ్చే ఏడాది ఫిబ్రవరి 16న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ కేషి బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ బ్రోచర్లను చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు, చిత్రకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ ఈ కాంపిటీషన్‌లో పాల్గొనదలిచిన వారు వచ్చే ఏడాది జనవరి 15 లోపు తమ ఎంట్రీలను 9885377653 పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేపీ బాబు, సోమయ్య, జిలాని, కృష్ణ ,సుబ్బారావు, మధు, పీవీ రమేష్ ఉన్నారు.



ఇండియా ఆర్ట్స్ ఫెస్టివల్ బ్రోచర్లను విడుదల చేస్తున్న మంత్రి పెమ్మసాని, చైర్మన్ బాబు తదితరులు



బీఆర్ స్టేడియంలో పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఐస్ స్కేటింగ్ పోటీలకు విశేష స్పందన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఐస్ స్కేటింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. అండర్-10, 10-13, 13-15, 15-17, 17-19, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు పెద్దఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. వరల్డ్ ఐస్ స్కేటింగ్ దినోత్సవం సందర్భంగా ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాజా మాట్లాడుతూ ఆయా విభాగాల్లో నిర్వ హించిన పోటీలలో దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి సర్టిఫికెట్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు షేక్ అబ్దుల్ సలాం, నూరిద్దీన్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులతో మాదల రత్నగిరిబాబు, కుటుంబసభ్యులు

మాదల శకుంతల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ, తారకరామ నగర్‌లోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాల (నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ)లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జన చైతన్య గ్రూపు సంస్థల అధినేత మాదల భాస్కరరావు, మాదల శకుంతల జ్ఞాపకార్థం మాదల రత్నగిరిబాబు, మాదల చైతన్య, మాదల శ్రీరామ్‌భాస్కర్‌ల ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులతో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర హాస్పిటల్స్ ప్రైమ్‌కేర్ కార్డియాక్, మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ పాటిబండ్ల శివాజీ, ప్రైమ్ కేర్ కార్డియాక్, మల్టీ స్పెషాలిటీ క్లినిక్ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ మాదల పూజ, హైమా స్పెషాలిటీ క్లినిక్ మూత్ర వ్యాధి నిపుణులు డాక్టర్ ఆరె కార్తీక్, డాక్టర్ చేకూరి సింధు, డాక్టర్ కడియాల శిల్పా, చంద్ర హాస్పటల్స్ కీళ్ళ సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ పీఎస్ఎస్ శ్రీరామ్‌లు హాజరై రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచిత శుక్ల సంబంధ శస్త్ర చికిత్సలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రత్నగిరబాబు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు మాదల భాస్కరరావు, మాదల శకుంతల జ్ఞాపకార్థం ఈ ఉచిత వైద్య శిబిరం ప్రారంభించినట్లు చెప్పారు. ఉచితంగా మందులు కూడా అందజేశామన్నారు. వైద్య సేవలందించిన డాక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్న ప్రసాదం వితరణ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ఓసీ జారీ చేయం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగ రంలో నూతన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవ నాలను ఆదివారం ఆయన పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు తనిఖీ చేశారు.తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరగాలని, ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పరిశీలించాలని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఫెడరేషన్ కప్‌కు మహిళా లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఫెడరేషన్ కప్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు మహిళా పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. 57 కిలోల జూనియర్స్ విభాగంలో షేక్ సాదియా అల్‌మాస్, 84 కిలోల పైబడిన విభాగంలో ఎస్‌కే షబీనా, బొల్లినేని చంద్రిక ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు అభినందించారు.



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

చికిత్స పొందుతున్న తల్లి కన్నుమూత

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 17వ లైనుకు చెందిన వృద్ధురాలు పుచ్చల సుబ్బులు(68) ఈ నెల 12న తన కూతురితో కలిసి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స పొందుతున్న వృద్ధురాలు ఆదివారం కన్ను మూసింది. ఇదే ఘటనలో తల్లితో పాటు గాయపడిన కుమార్తె రమణ చికిత్స పొందుతోంది. ఆస్తి వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు విద్యుత్‌శాఖ అధికారుల అడ్డంకులు

గుంటూరుకార్పొరేషన్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరులోని పెద్దపల్లి డొంకలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసేం దుకు స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాట్లు ప్రారంభించారు. గత నెల రోజులుగా ఆ ప్రాంతంలో ఎవరికి ఇబ్బంది లేకుండా రోడ్డు మార్జిన్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు దిమ్మెను నిర్మిస్తున్నారు. అయితే, ఆ ప్రాంతానికి చెందిన విద్యుత్ శాఖాధికారులు ఈ విగ్రహం ఏర్పాటును అడ్డుకుంటున్నారని స్థానిక టీడీపీ నాయకులు నల్లమోతు అజయ్ చౌదరి ఆరోపించారు. విద్యుత్ తీగలు తొలగించాలని అధికారు లకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో గత కొన్నిరోజులుగా పనులు ముందుకు సాగడం లేదని, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు అడ్డంకులు తొలగించాలని కోరారు.



శుద్దపల్లి డొంకలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ప్రారంభించిన పనులు

'రాష్ట్రంలో ఎస్సీల హక్కుల కోసం కృషి'

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీల హక్కుల కోసం కృషి చేయనున్నట్లు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన నిమిత్తం ఆదివారం విజయవాడలోని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ దర్శనపు శ్రీనివాస్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కనకదుర్గ అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో మక్వానాకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ పాల్గొన్నారు.



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్

సాహితీ రంగానికి 'సోమేపల్లి' సేవలు ఎనలేనవి

● డాక్టర్ పాపినేని శివశంకర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉన్నత ప్రభుత్వ ఉద్యోగిగా నిజాయితీ, నిబద్ధతతో పనిచేయడంతో పాటు సాహిత్య రంగంలో సోమేపల్లి వెం కట సుబ్బయ్య చేసిన సేవలు ఎనలేనివని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుం టూరు జిల్లా రచయితల సంఘం, రమ్య భారతి, సోమేపల్లి లిటరరీ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం 'సోమేపల్లి సాహితీ సౌరభం' పేరుతో సాహిత్య సమావేశాలు నిర్వహించారు. సభకు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సోమేపల్లి వెంకటసుబ్బయ్య రచనల్లో రైతులు, పేద ప్రజల జీవనశైలి, అంతరించిపోతున్న మానవీయ విలువలు ప్రతిబింబిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి మాట్లాడుతూ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆవిర్భావం ద్వారా యువ రచయితలకు స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప మానవతావాది వెంకటసుబ్బయ్య అని కొనియాడారు. అనంతరం సోమేపల్లి వెంకటసుబ్బయ్య స్మారక సంచిక 'హరిత సంతకం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు ఎస్ఎం సుభాని, నానా, శ్రీ వశిష్ఠ, విరించి, ఉమామహేశ్వరరెడ్డి, శర్మ, జయప్రకాష్, పుష్పాదేవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కానిస్టేబుల్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ లో కానిస్టేబుల్ బొడ్డు హనుమంతరావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గతంలో కానిస్టేబుల్ హనుమంతరావు కోర్టులోని మహిళ సిబ్బందిని లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఈ ఘటనపై అప్పట్లో పట్టాభిపురంస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హనుమంతరావును సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ హనుమంతరావుపై అట్రాసిటీ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

భూ కబ్జాకు యత్నించిన ఐదుగురిపై కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్ నగర్‌లో భూకబ్జాకు యత్నించిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట 6/ 21 కు చెందిన ఓబులాపురం నాగేంద్రంకు అశోక్ నగర్‌లో స్థలం ఉంది. అందులో 21 గజాలను ఆక్రమించేందుకుగాను నిట్టూరి సాయికుమార్, రాజ్, బొరుగు లక్ష్మి, సూర్యనారాయణ, శివకుమారిలు ప్రహరీ గోడ పగలగొట్టి అక్రమంగా స్థలంలోకి ప్రవేశించారు. నాగేంద్రంను దూషించి, చంపుతామని బెదిరించారు. భూకబ్జా తో పాటు పలు సెక్షన్ల కింద వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ట్యాలెంట్ షోలో పాల్గొన్న యువతులతో డాక్టర్ షమా సుల్తాన

ముగిసిన ట్యాలెంట్ షో సెమీ ఫైనల్ పోటీలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సలాం నమస్తే గుంటూరు సొసైటీ వ్యవస్థాపకురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ షేక్ షమా సుల్తాన ఆధ్వర్యంలో స్థానిక పొన్నూరు రోడ్డులోని ఎం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం గుంటూరు గాట్ ట్యాలెంట్ షో పోటీలు జరిగాయి. సింగింగ్, డ్యాన్స్, స్టాండ్ అప్ కామెడి, మ్యూజిక్ షో, మ్యూజి కల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, పొయట్రీ, ఫన్నీఆర్ మేసేజ్ ఓరియంటెడ్ స్కిట్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షమా సుల్తాన మాట్లాడుతూ ఈ ట్యాలెంట్ షో సెమీ ఫైనల్స్ ఆదివారం జరిగినట్లు చెప్పారు. ఈ నెల 22న ఇదే వేదికపై ఫైనల్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచే వారికి డిసెంబర్ 26వ తేదీన గురువారం సాయంత్రం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే కల్చరల్ నైట్‌లో జీజీటీ అవార్డులు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ సలాం, నాగేశ్వరరావు, షేక్ కరీం, అల్లాభక్షు, నూర్‌ఖాన్ పాల్గొన్నారు.

2025 హజ్ యాత్రికులకు శిక్షణ తరగతులు

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొత్తూరివారితోట హజ్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది 2025లో హజ్ యాత్రకు వెళ్లనున్న 260 మందికి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంజుమన్ షాదిఖానాలో శిక్షణా కార్యక్రమం జరిగింది. హజ్ యాత్రికుల ముఫ్తి షేక్ హజి రహమతుల్లా సాహెబ్, కమిటి సభ్యుల ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హజ్ యాత్రకు ఎలా తయారు అవ్వాలి? ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? ఇలాంటి పలు విష యాలను తెలియజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ హజ్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం హజ్ యాత్రికులకు శిక్షణా తరగతులు తొమ్మిది ఉంటాయని, ట్రైనింగ్ క్లాస్ నిర్వహిస్తూ ఉంటామని చెప్పారు.



కేసముద్రంలోని ఎంకే కన్వెన్షన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

'తెలుగు' రాజకీయాలను శాసించేది కాపులే!

» పార్టీలు వేరైనా కాపులంతా కలిసికట్టుగా ఉండాలి: గంటా

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించే శక్తి ఒక్క మున్నూరు కాపులకే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎంకే కన్వెన్షన్‌ను సంఘం అధ్యక్షుడు చందా గోపితో కలిసి గంటా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని కాపుల్లో రకరకాల పేర్లతో విభజించి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని, అన్ని రకాల కాపులు ఒక్కటేనని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా మున్నూరుకాపులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇక్కడి కన్వెన్షన్ హాల్‌కు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

జమిలి మంచిదే: కేంద్ర మంత్రి పెమ్మసాని

పెదకాకాని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వీవీఐటీ కళాశాల ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెప్తే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాల్సి ఉందని చెప్పారు.

అల్లు అర్జున్‌కు జగన్ వత్తాసు నీచాతినీచం

» సీపీఐ రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్.. సినీ హీరో అల్లు అర్జున్‌కు వత్తాసుగా మాట్లాడటం నీచాతినీచమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఓట్ల కోసం రాజకీయ నేతలు సినిమా హీరోలకు ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనలో కనీస మానవత్వంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రూ.వందల కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్న సినిమా హీరోకి జగన్, బండి సంజయ్ వత్తాసు పలకడం సిగ్గుచేటు. పుష్ప-2 సినిమా టిక్కెట్ ధర రూ.1200లకు పెంచడం దారుణం. అని రామకృష్ణ వివరించారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

యూనివర్సిటీలకు వెంటనే వీసీలను నియమించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంకా ఉన్నత విద్యామండలికి ఛైర్మన్‌ను నియమించలేదని పేర్కొన్నారు. 4,439 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మధ్యలోనే ఆగిపోయిందన్నారు.

అల్లుడూ ఎలా ఉన్నావ్?.. అర్జున్‌కు చిరంజీవి పలకరింపు

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ చిరంజీవి ఆలింగనం చేసుకున్నారు.

రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

» తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

» ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, చారిత్రక స్థలాల పర్యాటకం ఉన్న మాదిరిగానే సాహితీ పర్యాటకం కూడా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. 35 ఏళ్ల నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెబుతూ అందుకు సంబంధించిన వివరాలను వారు తెలియజేశారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవం నిర్వహణకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడడం.. వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్రాల నిర్మాణం వంటి వాటి ద్వారా ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. మాతృ భాషపై నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతో పాటు మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. 'వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖ గ్రంథాలయాలు ఏపీలో ఉన్నాయి. వీటిని, కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశంపై భాషా, సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు టి.మనోహర్ నాయుడు, కె.లక్ష్మయ్య, గొల్లనారాయణరావు, సాందీపని ఉన్నారు.



విజయవాడలో జరగనున్న బుక్ ఫెస్టివల్‌కు రావాలని కోరుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం అందిస్తున్న బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు

తప్పు నాదే.. క్షమించండి

» జర్నలిస్టు రంజిత్‌తో మోహన్ బాబు

» కొడుకు విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు... శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు. సుమారు 15 నిమిషాల పాటు మోహన్‌బాబు.. జర్నలిస్టు రంజిత్ వద్ద ఉన్నారు.



రంజిత్ కుటుంబసభ్యులతో మంచు కుటుంబం

విష్ణు అనుచరులతో ప్రాణహాని ఉంది

» జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు: మంచు మనోజ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచు మోహన్‌బాబు కుటుంబంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ మధ్య మళ్లీ విభేదాలు భగ్గుమన్నాయి. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోసి విద్యుత్తు సరఫరా నిలిపివేయడం ద్వారా విష్ణు అనుచరులు నన్ను, నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని మంచు మనోజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. "నన్ను, నా కుటుంబాన్ని మంచు విష్ణు, అతడి అనుచరులు పలు విధాలుగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శనివారం నేను షూటింగ్‌కు వెళ్లగా.. నా భార్య కుమారుడి స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లారు. మా అమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ ఇచ్చే నెపంతో మంచు విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్లు ఇంటికి వచ్చారు. ఈ సమయంలో వారు నా జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు. దీని కారణంగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. జనరేటర్‌కు సమీపంలోనే కార్లు, గ్యాస్‌కు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ఒకవేళ నిప్పురవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే ఇంట్లో ఉన్న నా 9 నెలల పాప, వృద్ధురాలైన నా తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. మా అమ్మ పుట్టిన రోజున ఇలా జరగడం నా మనసును కలిచివేసింది. ఇది పూర్తిగా కుటుంబ సమస్య.. కానీ నా కుటుంబ క్షేమం, రక్షణ కోసం అన్ని అంశాలను బహిరంగపర్చాల్సి వస్తోంది. నేడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అని పేర్కొన్నారు.

వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

» బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి ఇవ్వాలి: మంద కృష్ణ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజకు ఇంకా వెంటిలేషన్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజకు అందిస్తున్న చికిత, అతడి ఆరోగ్యస్థితిపై ఆదివారం సాయంత్రం ఆస్పత్రి హెల్త్‌బులిటెన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో బాబుకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స కొనసాగుతోందని వైద్యులు చేతన్ ఆర్. ముందాడ, విష్ణు తేజ్ తెలిపారు. శ్రీతేజ వైటల్ పారామీటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం బాగానే తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. జ్వరం వస్తోందని.. మెదడు, నాడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని వివరించారు. నాడీ సంబంధిత ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా శ్రీతేజను పరామర్శించేందుకు ఆదివారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆస్పత్రికి వచ్చారు. అతడి ఆరోగ్యస్థితి గురించి వైద్యులను, బాలుడి తండ్రి భాస్కర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీతేజ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీతేజను సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ సభ్యులు కూడా ఆదుకోవాలని కోరారు. శ్రీతేజను పరామర్శించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి కూడా ఆస్పత్రికి వచ్చారు.



కిందపడిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల, ఇతర నేతలను పైకి లేవదీస్తున్న దృశ్యం

కౌడా ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో అపశ్రుతి

» ఎక్కువ మంది ఎక్కడంతో కూలిన వేదిక

» ఇద్దరు ఎమ్మెల్యేలు సహా పలువురికి స్వల్ప గాయాలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఛైర్మన్‌గా జనసేన నేత తుమ్మల రామస్వామి(బాబు) ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా.. వేదిక పైకి ఎక్కువ మంది ఎక్కడంతో అకస్మాత్తుగా అది కుప్పకూలింది. దీంతో స్టేజీపై ఉన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, తుమ్మల రామస్వామితో సహా పలువురు కూటమి నాయకులు కింద పడిపోయారు. ఈ పరిణామంతో సభా ప్రాంగణంలో కొంత తొక్కిసలాట జరిగింది. పోలీసులు, భద్రతా సిబ్బంది, నాయకులు తేరుకుని కిందపడిన వారికి రక్షణ వలయంగా ఉండి.. పైకి లేపి సపర్యలు చేశారు. ఎమ్మెల్యే చినరాజప్ప కాలికి స్వల్ప గాయం కాగా, ఆయన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. యనమల ప్రమాణస్వీకారం వరకు ఉండకుండా మధ్యలోనే తన క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే నానాజీకి వీపు, తలకు దెబ్బలు తగిలాయి. అనంతరం నానాజీ అధ్యక్షతన మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా కౌడా ఛైర్మన్‌గా తుమ్మల రామస్వామితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కౌడా వైస్ ఛైర్‌పర్సన్, కమిషనర్ భావన, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

విడుదల తేదీ ఖరారు

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి నటిస్తున్న 50వ చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేశారు. ఆదివారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదలవుతున్నట్లు ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనుష్క లుక్‌ను ప్రజెంట్ చేస్తూ.. 'విక్టిమ్.. క్రిమినల్.. లెజెండ్' అని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో లోతైన సమస్యలో కూరుకుపోయిన ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి ..వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది.





బిగ్‌బాస్ సీజన్ 8 గెలుపుగుర్రం నిఖిల్

ఒక టీవీ షో.. ప్రతి సంవత్సరం దాదాపు మూడు నెలల పాటు ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులకు అంతులేని వినోదంతో పాటు మరిచిపోలేని జ్ఞాపకాల్ని పంచిన ఆ షో బిగ్‌బాస్. గత ఏడు సీజన్‌లు అందించిన వినోదానికి ఏ మాత్రం తగ్గకుండా సెప్టెంబర్ 1న మొదలైంది తెలుగు బిగ్‌బాస్ సీజన్ 8. 105 రోజుల పాటు ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను విశేషంగా అలరించి.. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. బిగ్‌బాస్ సీజన్ 8 గేమ్ షో విజేత ఎవరో తెలిసిపోయింది. ఈ ఏడాది షో విన్నర్‌గా నిఖిల్‌ను వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్.. విజేతకు ట్రోఫీతో పాటు రూ.55 లక్షల ప్రైజ్‌మనీ, మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారుని అందజేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని సీజన్ల కన్నా ఈ సీజన్ ప్రైజ్ మనీ ఎక్కువ కావడం విశేషం. విజేతకు చివరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్‌కృష్ణ రన్నరప్‌గా మిగిలారు. టాప్ 5 కంటెస్టెంట్లుగా పోటీ చేసిన నబీల్, ప్రేరణ, అవినాశ్‌లకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఓట్ల ఆధారంగా వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాలు దక్కాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ఐదో స్థానంలో నిలిచిన అవినాశ్‌ను హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ .. నాలుగో స్థానంలో ఉన్న ప్రేరణను కన్నడ స్టార్ ఉపేంద్ర.. మూడో స్థానంలో మిగిలిన నబీల్‌ను విజయ్‌సేతుపతి, మంజు వారియర్ బయటకు తీసుకుని వచ్చారు.

నభానటేష్ స్టెప్పులు

ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేలో హీరోయిన్ నభా నటేశ్ స్పెషల్ పర్ఫామెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'పుష్ప 2'లోని 'వస్తున్నాయ్ పీలింగ్స్' పాటతో పాటు మరికొన్ని సాంగ్స్‌కు స్టెప్పులేసి అలరించారు. పలువురు సినీతారలు తళుక్కుమనడం.. శ్రీకృష్ణ, గీతా మాధురి పాటల ప్రదర్శన... టాప్ 5 కంటెస్టెంట్స్ ఆటపాటలతో షో ఆకట్టుకుంది. నాగార్జున జరిపిన సరదా సంభాషణలు.. సీజన్ 8 హౌజ్‌ను చూపించి అందర్నీ గతంలోకి తీసుకెళ్లడం.. ఇలా ఫినాలే ఆరంభం నుంచి విన్నర్‌ని ప్రకటించేదాకా వరకు హౌజ్‌లో జరిగిన హంగామా అంతా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

సీజన్ 7 ఫినాలే తర్వాత జరిగిన గొడవల్ని, అల్లర్లను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అభిమానులు ఎవ్వరూ స్టూడియోస్‌కు రావొద్దని.. విజేతను ప్రకటించాక ఊరేగింపులు, ర్యాలీలు చేయొద్దని పోలీసులు సూచించారు.



సినీ ఫైనాన్సియర్ బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) తనయుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతారామిరెడ్డి కుమార్తె శిరీషతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి గ్రూప్స్ అధినేత వేమూరి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కథానాయిక కీర్తిసురేశ్ ఇటీవలే తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌ను పెళ్లాడిన విషయం తెలిసిందే. తొలుత ఈ నెల 12న గోవాలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో జరగ్గా, తర్వాత క్రైస్తవ సంప్రదాయాన్ని అనుసరించి వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఆ ఫొటోలను కీర్తిసురేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



శివకార్తికేయన్‌తో శ్రీలీల

తమిళ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. 'ఎస్‌కే 25' వర్కింగ్ టైటిల్. సుధాకొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. జయం రవి, అథర్వ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శివకార్తికేయన్ ప్రతిభావంతుడైన నటుడు. ఆయనతో సినిమా చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా నిర్మిస్తున్నాం' అని చెప్పారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె. చంద్రన్.

గర్వంగా ఉంది



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటించిన చిత్రం 'విడుదల 2'. గతేడాది రిలీజై విజయం సాధించిన 'విడుదల' పార్ట్ 1కు కొనసాగింపుగా ఇది తెరకెక్కింది. సూరి, మంజు వారియర్ కీలక పాత్రల్లో నటించారు. నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించినందుకు ఎంతో గర్వంగా ఉంది. నా సినిమాల్ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల సపోర్ట్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇళయరాజా అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణ. చిత్రం తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా" అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు.



శరవేగంగా చిత్రీకరణ

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బాబు జగ్జీవన్ రామ్'. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రదీప్ దోనెపూడి. బాబు జగ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ ఫిల్మ్‌ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం షూటింగ్ వివరాలను వివరించింది. చిత్రదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'జగ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జగ్జీవన్‌రామ్ వర్ధంతి అయిన జూలై 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అందరికీ నచ్చుతుంది



కేవీజీ రాజు దర్శకత్వంలో లోకేశ్ బాబు దాసరి, శిరీష హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ఉల్లా సంగానే ఉత్సాహంగానే'. శ్రీ మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమామహేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎండీ కలామ్, ఖదీర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కేవీజీ రాజు మాట్లాడుతూ' ఈ చిత్రంలో లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. త్వరలో సాంగ్స్ ట్రైలర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. నిర్మాత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ' ఒక మంచి లవ్ స్టోరీని తెరకెక్కించాం. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

లైంగికంగా వేధించాడు





బాలీవుడ్ సంగీత దర్శకుడు రాజేశ్ రోషన్ తనను లైంగికంగా వేధించారని గాయని లగ్నజితా చక్రబర్తి ఆరోపించారు. సంగీత చర్చల కోసం తన ఇంటికి పిలిచిన రాజేశ్ రోషన్ అసభ్యకరంగా తాకారని ఆమె చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో లగ్నజితా మాట్లాడుతూ 'నేను ముంబైలో ఉన్న రోజుల్లో ఓ సారి రాజేశ్ రోషన్ పిలవడంతో వారి ఇంటికి వెళ్లాను. వాద్య పరికరాలతో నిండి ఉన్న గదిలోకి నన్ను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. నాక్కొంచెం దూరంలో ఆయన కూర్చున్నారు. నేను ఫోన్ చూస్తుండగా, రాజేశ్ రోషన్ నెమ్మదిగా నా వైపు కదలడం గమనించాను. అతను ఏం చేస్తాడో చూద్దాం అని నేను గమనించనట్లే ఊరుకున్నాను. రాజేశ్ రోషన్ నా స్కర్ట్‌లోకి తన చేతులను దూర్చాడు. నేను వెంటనే తేరుకొని అక్కడ నుంచి బయటకు పరుగుతీశాను. జుగుప్సాకరమైన ఆ సంఘటన గురించి కెమెరా ముందు మాట్లాడలన్నా సిగ్గుగా ఉంది. మొదట దిగ్భ్రాంతికి గురయ్యాను. అయితే జరిగిన దాంట్లో నా తప్పేం లేదు, అతనిది దిగజారుడు వ్యక్తిత్వం అని అర్థం చేసుకొని, ఆ సంఘటన వల్ల క్షోభకు గురికాకుండా నన్ను నేను కాపాడుకున్నాను' అని తెలిపారు. లగ్నజితా ఆరోపణలపై రాజేశ్ రోషన్ స్పందించలేదు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగులు ఉండగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 223 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 82 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 51 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 139 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 975 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

శ్రీకనకపుట్టలమ్మ తల్లికి అఖండజ్యోతుల సమర్పణ

దుగ్గిరాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు గ్రామంలో శ్రీకనకపుట్టలమ్మతల్లికి అఖండ జ్యోతుల సమర్పణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మార్గశిరమాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని రేణుకమ్మతల్లి ఆలయం నుంచి 500మంది మహిళలు అఖండ జ్యోతులతో రామాలయం మీదుగా శ్రీకనక పుట్టలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. భవాని స్వాములు మేళతాళాల మధ్య జరిగిన జ్యోతుల ఉత్సవంలో కనకపుట్టలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఈనెల 25న అమ్మవారి ఇరుముడుల కార్యక్రమం అనంతరం 26న శాంతిహోమం, పూర్ణాహుతి, భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించనున్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో హోమాలు

మంగళగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని శ్రీవీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గణపతి హోమం, శాంతి హోమం, మృత్యుంజయ హోమాలు జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ 20 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాడి వెంకట్రావు, కూటమి నేతలు కొమ్మా సుకుమార్, కట్టా కృష్ణ, శానం మాణిక్యరావు, గూడపాటి వీర తేజ, మోతుకూరి రవి, తాటి గణేష్, పండల దుర్గారావు, కాటాబత్తుల శ్రీనివాసరావు, తాటి పాముల నాగరాజు, పుట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళ శ్రీవాణికి అంతర్జాతీయ అవార్డు



ఆళ్ళ శ్రీవాణి (ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వీవీఐటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పెదనందిపాడుకు చెందిన ఆళ్ళ శ్రీవాణి ఆదివారం అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రపంచ ప్రఖ్యాత ఎడ్విన్ గ్రూప్ వారు నిర్వహించిన 35వ జాతీయ కాన్ఫరెన్స్‌లో వర్చువల్ మోడ్‌లో కీనోట్ స్పీకర్‌గా పాల్గొన్న శ్రీవాణికి అడ్వాన్స్‌డ్ మెటీరియల్ రీసెర్చ్ విభాగంలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ టెక్నాలజిస్ట్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకోవడం పట్ల పలువురు అధ్యాపకులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

12వ రోజుకు చేరిన ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న దీక్షలు ఆదివారంతో 12వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల దీక్షలను తుపాకుల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆదివారం నాటి దీక్షల్లో ఏనుగుల సాంబయ్య, వేమి వెంకటేశ్వరరావు, దేవరపల్లి అంకయ్య, బెంజిమెన్ ఆశీర్వాదం కూర్చున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, కార్మిక సంఘ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ, గురవయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, రమణ, నవనీతం దుర్గా భవాని, తదితరులు పాల్గొన్నారు.

నీరుకొండలో నేడు వైద్యశిబిరం

మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదల గోవర్ధనరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలోని శివాలయం సెంటర్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు, నాట్కో, ఐల్యాబ్స్, ఎపిరాన్ హెల్త్‌కేర్ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరాన్ని మంత్రి పీ.నారాయణ ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో బీపీ, షుగర్, సీబీసీ, క్రియాటిన్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

తాడేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ వద్ద కృష్ణానదిలో ఈతకు వచ్చిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన ఎం సీతారామిరెడ్డి (58) ఆదివారం ఉదయం యథావిధిగా ఈత కొట్టేందుకు కృష్ణాతీరానికి వచ్చారు. పడవల రేవు వద్ద నుంచి నీటిలో దిగి కొద్దిసేపు ఈత కొట్టారు. ఆ సమయంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో అస్వస్థకు గురై నీటిలోనే మృతి చెందారు. తోటి స్విమ్మర్లు ఆయనను బయటకు తీసుకువచ్చి ప్రాథమిక చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కుటుంబసభ్యులకు సమాచారం అందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులుగా బూరగ వెంకటేశ్వర్లు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులుగా పట్టణ సీపీఎం కార్యదర్శి ప్రకాష్‌నగర్‌కు చెందిన బూరగ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ నెల 14, 15 తేదీన గుంటూరు జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మహాసభల్లో ప్రతినిధులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూరగ ఎన్నికపట్ల మండల, పట్టణ సీపీఎం నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఏపుగా పెరిగిన పిచ్చి తుమ్మచెట్లు.. చిన్నబోతున్న పిల్లర్లు

- లే అవుట్‌లో కనిపించని రోడ్లు, కాలువలు
- ప్రభుత్వం అవకాశమిచ్చినా కనిపించని ఫలితాలు



ఏపుగా పెరిగిన పిచ్చి తుమ్మచెట్లతో వంగిపురంలోని హౌసింగ్ లే అవుట్

ప్రత్తిపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మధ్యలో ఆగిన గృహాలను పూర్తి చేసేందుకు తెలుగుదేశం ప్రభుత్వం మన ఇల్లు, మన గౌరవం పేరిట శ్రీకారం చుట్టారు. త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే తిరిగి గృహాల మంజూరుకు అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడంతో పాటు వారితో గృహాలు పూర్తి చేయించే విధంగా పనిచేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి పూర్తిగా కొరవడినట్టు ఉంది. అందుకు మండలపరిధిలోని వంగిపురం గ్రామంలోని లేఅవుట్‌ను చూస్తే అర్థమవుతుంది. వంగిపురం గ్రామంలోని లేఅవుట్‌లో ఏపుగా పెరిగిన పిచ్చి చెట్ల మధ్య ఫౌండేషన్ స్థాయిలో ఆగిన ఇళ్లు గత ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అప్పటి నుంచి నేటి వరకు ఈ కాలనీలోకి అడుగుపెట్టిన దాఖలాలు కనిపించలేదు. మండలంలో ప్రత్యేకాధికారితో తొలుత గృహ నిర్మాణాలపై గ్రామ స్థాయిలో వారం వారం సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత దాని గురించే అధికారులు పట్టించుకోవడం మానేసినట్టున్నారు. ఈ పరిస్థితుల్లో వంగిపురంలో రోడ్లు కూడా కనిపించకుండా మొత్తం పిచ్చి చెట్లతో నిండిపోయింది. లేఅవుట్ పరిస్థితి ఇలా లబ్ధిదారులు ఎవరూ కూడా ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ఎస్టిమేషన్లు వేయించి రోడ్లు వేయిస్తాం

● ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ వీరాంజనేయులు

వంగిపురంలో గృహాలు నిర్మించుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వారికి గృహాలు ఉన్నట్లు తెలుస్తుంది. అందువల్ల అక్కడ లేఅవుట్‌లోకి ఎవరూ రాకపోవడం వల్ల పిచ్చి చెట్లు మొలిచి ఉన్నాయి. పీఆర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఎస్టిమేషన్లు వేయించి రోడ్లు వేసే ఏర్పాటు చేస్తాం.

మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

- ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామచంద్రరావు
- పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాల యం అధికారులు

తాడికొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహనీయులు ఆశయాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జీ రామచంద్రరావు అన్నారు. ఆదివారం లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలంటూ అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు పీవీ సత్యనారాయణ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఏపీ రమణ, టీ లక్ష్మీ, వై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

ప్రత్యేక అంధ్ర రాష్ట్ర సాధన కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు అని ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి కాకుమాను సీతారామయ్య అన్నారు. తాడికొండలోని గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చుండూరు నాగేశ్వర రావు, లింగమల్లు మహేష్, కూరపాటి రాఘవరావు, పేర్ల శ్రీనువాసు, రైతుసంఘం నాయకులు చింతల భాస్కరరావులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంకా బాలాజీగుప్తా అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనా రాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కారంపూడి అంకమ్మరావు, నాగబాబు, నల్లగొండ పరమేశ్వరరావు, బిట్రా నాగరాజు, పొట్లాబత్తుని నరసింహారావు, కట్టిపోగు ఉదయభాస్కర్, పఠాన్ మస్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఏపీఎస్పీ ఆరో పటాలంలో కమాండెంట్ కే.నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, ఇతర అధికారులు, సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పించారు. మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అలీం బాషా, అధికారులు, సచివాలయ సిబ్బంది శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. జనసేన నేత తిరుమలశెట్టి కొండలరావు, విక్టర్‌పాల్, కే హనుమంత రావు, సుబ్రహ్మణ్యం తదితరులు మెయిన్ బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పించారు.



మంగళగిరిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద తహసీల్దార్ సీతారామయ్య ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం చేసిన పోరాటాన్ని మరవకుండా అమరజీవి పొట్టి శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

దుగ్గిరాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకై ఆమర ణదీక్ష పూని తుదిశ్వాస వరకూ పోరాడిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. స్థానిక రైలుపేటలోని చెక్ పోస్ట్‌వద్ద నున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, కరీముల్లా ఆర్యవైశ్య సంఘీయులు అన్నవరపు సత్యనారాయణ, చుండూరు లక్ష్మణ్‌కుమార్, మోహన్‌కుమార్, వంకదార ఫణి, హేమంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి కే వివేకానంద తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. చిలువూరు పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, శేషగిరి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈమనిలో మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, శాఖా గ్రంథాలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా, గ్రంథాలయ అధికారి సుభాషిణి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, పారిశ్రామికవేత్తలు ముద్దన రాఘవయ్య, అరవపల్లి కృష్ణ, దాసరి సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, వెలినేని శివయ్య పాల్గొన్నారు.

ఎన్నారై ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగం, ఈఎన్‌టీ, నేత్ర, గైనకాలజీ, కీళ్ల, ఎముకలు, చర్మ, గుండె, కిడ్నీ, నడుము, వెన్నుపూస సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. 120 మంది వైద్యులు, 200 మంది సిబ్బంది క్యాంపులో పాల్గొని 1200 మందికి వైద్య సేవలు అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్డియాక్ ఎకో, అల్ట్రాసౌండ్, రక్త పరీక్షలు చేసి సుమారు రూ.4 లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. తొలుతు వైద్యశిబిరాన్ని ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్నారై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, డాక్టర్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

200మందికి ఉచిత వైద్యసేవలు

తాడేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, కుంచనపల్లిలో మానవ సేవా సంస్థ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆదివారం 200 మందికి స్థానిక రామ్‌స్నేహ ఎవెన్యూ అపార్టుమెంటులో ఉచిత పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, ఇతర జనరల్ వైద్య పరీక్షలు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి నెల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా కుంచనపల్లిలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, శిబిరం నిర్వాహకులు వంగర సురేష్‌కుమార్, వైద్యులు డాక్టర్ నిఖిల్, శ్రీకర్, లక్ష్మి, సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, ఆదినారాయణతదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక



వధూవరులకు పెళ్లికానుక అందజేస్తున్న ఈపూరి బాబు, కాట్రగడ్డ మధు తదితరులు


తాడేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ అనీలు మనవరాలు షేక్ హుస్సేన్ బీ - షేక్ సూరజ్ అహ్మదు వివాహానికి హాజరై, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను ఆదివారం అందజేసి వధూవరులకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, షేక్ ఇమామ్‌సా, షేక్ మస్తాన్‌బీ, షేక్ జానీ, షేక్ అన్వర్ బాషా తదితరులు నూతన వధూవరులను అభినందించారు.

క్రీస్తు జయంతిని ఘనంగా జరుపుదాం

బాల ఏసు చర్చి ఫాదర్ పాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో ఈ నెల 25వ తేదీన జరిగే క్రీస్తు జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరపటానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని బాల ఏసు చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలోని ఫాదర్ల బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరప్ సంప్రదాయంగా రెండు వందల ఏళ్ళ క్రితం నుంచి గ్రామంలో ఈ పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రానున్నారన్నారు. వేలాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


పండుగలా.. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

తుళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లు పాల్గొన్న నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఒక పండుగలాగ జరిగింది. టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు టీడీపీ తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డనేటర్ నెల కుదిటి చంద్రశేఖర్(చందు) నేతృత్వంలో బైకులు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. మహిళలు ర్యాలీలో పాల్గొని పూలు చల్లారు. తెలుగుయువత సభ్యులు భారీ ఎత్తున బాణసంచా పేల్చారు. పెట్రోలు బంకు నుండి కొత్తూరు సెంటర్ మీదగా విగ్రహావిష్కరణ లైబ్రరీ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. భారీ గజ మాలతో కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేని టీడీపీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటా అప్పారావు, జొన్నలగడ్డ కిరణ్, బండ్ల పట్టాభి రామయ్య, జమ్ముల అనిల్ జయకృష్ణ, హరికిరణ్(బాబి) కొమ్మినేని, బండ్ల తేజ, కొమ్మినేని బాబ్జి నిమ్మగడ్డ సురేష్, మోదేపల్లి శంకరు, జయకృష్ణ, రాకేష్, బీజేపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, ధనేకుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎగువ సన్నిధిలో.. ట్రాఫిక్ కష్టాలు



ఎగువ సన్నిధి ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్



ఘాట్‌రోడ్డులో అడ్డగోలుగా నిలిపిన వాహనాలు

మంగళగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీపానకాల నృసింహస్వామి క్షేత్రం ఎగువ సన్నిధిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా వుండడంతో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ ప్రదేశంలో కాకుండా వెలుపలనే నిలిపివేసి దర్శనానికి వెళుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆటోల తాకిడి ఎక్కువగా ఉండటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. వాహనాలను నియంత్రించేందుకు దేవస్థానం ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ట్రాఫిక్ రద్దీలో చిక్కుకుని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్లపై ప్రభుత్వాలు పునరాలోచించాలి

మేడికొండూరు డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో ఆదివారం హలో మాల ఛలో గుంటూరు కార్యక్రమానికి సంఘీభావంగా మేడికొండూరు మండల పరిధిలోని సిరిపురం గ్రామం నుంచి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించి గుంటూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ నాయకుడు నంద అనిల్ మాట్లాడుతూ మాల, మాదిగలను విడదీసి పాలించే కుట్రలను తాము సహించ బోమన్నారు. రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని డిమాండ్ చేశారు. మాలలకు అన్యాయం చేయాలని చూస్తే పరిణామాలు వేరుగా ఉంటాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలంతా ఏకమై ఉద్యమిస్తామని నంద అనిల్ చెప్పారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిరిపురం గ్రామంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి గుంటూరులో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో గుడిపూడి శంకర్, పిల్లి నరేష్, లక్క సాగర్, లామ్ రవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి

● ఎంప్లాయిస్ యూనియన్ అడిషనల్ సెక్రటరి కృష్ణారావు



కేంద్రమంత్రి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణారావు

తుళ్లూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదని ఎంప్లాయిస్ అడిషనల్ జనరల్ సెక్రటరి జె.కృష్ణారావు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తెలిపారు. ఆదివారం తుళ్లూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు మంత్రి వచ్చిన సందర్భంలో కృష్ణారావు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి పెమ్మసాని స్పందించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి జీతాలు అందేవిధంగా చూస్తానని హామీనిచ్చారు.

ఫెడరేషన్ కప్‌కు మహిళా లిఫ్టర్ల ఎంపిక



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ఫెడరేషన్ కప్ పోటలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు మహిళా పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. 57 కిలోల జూనియర్స్ విభాగంలో షేక్ సాదియా అల్‌మాస్, 84 కిలోల పైబడిన విభాగంలో ఎస్‌కే షబీనా, బొల్లినేని చంద్రిక ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

అహల్య ట్రస్టు ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, శనక్కాయల రాజకుమారి

తాడికొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అహల్య ట్రస్టు డైరెక్టరు శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో రావెల గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. వైద్యశిబిరాలను గ్రామాల్లో, పల్లెల్లోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో 250 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు టీడీపీ మహిళా నాయకురాలు, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. గ్రామాల్లో పేదలకు ఉచితం గా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడమే లక్ష్యంగా అహల్య ట్రస్టు పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు, మాజీ వైస్ ఎంపీపీ దగ్గుమల్లి శ్రీనివాసరావు, టీడీపీ రావెల అధ్యక్షుడు గుణవర్ధన్‌రావు, మాజీ సర్పంచ్ చినపాములు, పీ సీతారామయ్య, వీ వెంకటేశ్వరరావులు, డాక్టర్లు శిరీష, రమేష్, అక్షయ జైన్, కార్తీక్ పాల్గొన్నారు.


జాతీయ వాలీబాల్ విజేతగా ఎస్ఆర్ఎం వర్సిటీ



ట్రోఫీ అందుకుంటున్న ఎస్ఆర్ఎం వర్సిటీ టీమ్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాదెళ్ల బసవ పూర్ణయ్య (ఎన్‌బీపీ) ట్రస్టు అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నీ విజేతగా ఎస్ఆర్ఎం వర్శిటీ టీమ్ నిలిచింది. నాలుగు రోజులుగా విజయవాడ నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆదివారం నాటి చివరి లీగ్ మ్యాచ్‌లో బ్యాంక్ మహారాష్ట్రపై విజయం సాధించిన ఎస్ఆర్ఎం టీమ్ రూ.75వేల నగదు, ట్రోఫీని వశం చేసుకుంది. ఈ ఓటమితో బ్యాంక్ మహారాష్ట్ర మూడోస్థానానికి పడిపోగా, తమిళనాడు క్రీడాప్రాధికార సంస్థ టీమ్ రన్నరప్ వరించింది. విజేతలకు ట్రోఫీలు, నగదు పారితోషికాల అందజేతకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)హాజరై అందజేశారు. అర్జునఅవార్డీ అరికెపూడి రమణరావు, నిర్వాహకులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకర్‌రావులతో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) ఎంపీని సత్కరించారు. అమరావతి యూనియన్ బ్యాంకు డీజీఎం శారదామూర్తి, హెల్ప్ హాస్పిటల్ డైరెక్టర్ పి.రవితేజ, అప్పాజీలు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ఎడ్యుకేషన్ అకాడమి ఆఫీసర్ సీహెచ్ తులసీని సన్మానిస్తున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని లాం చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ, ఫార్మ-డీ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ క్లాస్ రూమ్‌లో స్మార్ట్ యాక్టివిటీలు, అధునాతన పద్ధతుల ద్వారా బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, జపాన్ తదితర దేశాలు ఇండియాలో ఫార్మ పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 10వేలకు పైగా ఫార్మ నిపుణుల ఆవశ్యకత ఉందన్నారు. ఏపీ ప్రభుత్వ కొల్లిజియెట్ ఎడ్యుకేషన్ అకాడమి ఆఫీసర్ సీహెచ్ తులసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం, ఫిట్‌నెస్, మైండ్ మ్యాపింగ్, కెరీర్, ఆధ్యాత్మికత, సర్కిల్, స్పేస్, మైహోమ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను తరచూ పర్యవేక్షించాలని, చెడు వ్యవసనాలకు బానిసలు అవ్వకుండా చూసుకోవాలన్నారు. టెక్నాలజీతో పోటీపడుతూ సెల్‌ఫోన్, కంప్యూటర్లు, అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. కార్య క్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ఇంగ్లిష్ ప్రొఫెసర్ బీ వరలక్ష్మి, గుంటూరు జీసీఎస్ జూనియర్ కళాశాల ప్రధానో పాధ్యాయిని ఏవీ రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అథ్లెటిక్ పోటీల్లో జేఎంజే క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో జేఎంజే కళాశాల క్రీడాకారులు ప్రతిభ చూపారు. హైజంప్‌లో బీకాం విద్యార్థిని హేమలత గోల్డ్ మెడల్ సాధించింది. ట్రిపుల్ జంప్, 400 మీటర్ల రిలేలో సిల్వర్ మెడల్స్ దక్కించుకుంది. బీఎస్సీ విద్యార్థిని రూప హైజంప్, 400 మీటర్ల రిలేలో సిల్వర్ మెడల్స్, కవిత, దుర్గ అనే విద్యార్థులు 400 మీటర్ల రిలేలో సిల్వర్ మెడల్స్ సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ షైనీ, మేరీ, శారద, అరుణ సుజాత అభినందించారు.

పేదల పిల్లలందరూ చదువుకోవాలి: డాక్టర్ శ్యాం

తెనాలి రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదల పిల్లలందరూ చదువుకోవాలని రూరల్ లిప్రసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్యాం చెప్పారు. ఆదివారం కార్డ్స్ కమ్యూనిటీ అండ్ రూరల్ డెంలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని అంగలకుదురులో బాలబాట కార్యక్రమం నిర్వహించారు. చదువు యొక్క ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు వివరించారు. గురుకుల పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందించే సౌకర్యాలను తెలిపి, బాలలందరినీ బడిబాట పట్టించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు రంజన్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ అనిత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగుతున్న కనకదుర్గా భవానీ అమ్మవారు

భక్తి శ్రద్ధలతో జ్ఞాన జ్యోతుల ప్రదర్శన

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీకనకదుర్గా భవానీ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞాన జ్యోతుల ప్రదర్శన భక్తి శ్రద్ధలతో జరిగింది. పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో ఉన్న ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణం జరిగి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పూజలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పులి వాహనంపై కనకదుర్గా భవానీ అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాలు దుర్గాకాళిక, మహాశివుడు, అఘోరాల అలంకారాలు, నృత్యాలు, పట్టణ వాసులను విశేషంగా ఆకర్షించాయి. 26కిలోల కర్పూర జ్యోతిని ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

విశ్వ విరాట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భాస్కరప్రసాద్

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వ విరాట్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కంచర్ల భాస్కర ప్రసాద్ ఎన్నికయ్యారు, స్థానిక విశ్వబ్రాహ్మణ కాలనీలో ఆదివారం శ్రీవిశ్వ విరాట్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా చింతాడ రమేష్, కార్యదర్శిగా కాకుమాను శివరామశర్మ, జాయింట్ సెక్రటరీగా ధరణికోట శేషసాయి, కోశాధికారిగా మారోజు జగదీష్, కానూరి సురేష్‌బాబు తదితరులు ఎన్నికయ్యారు. విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి పాటుపడతామని ఈ విశ్వ విరాట్ సంక్షేమ సంఘం నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమావేశం

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రథమ ప్రైవేటు పాఠశాల ఐడియల్ విద్యాసంస్థల 2001 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. పట్టణంలో కేజీ టూ పీజీ విద్యను అందించిన సంస్థ నిర్వాహకులు రావులపల్లి సాంబశివరావు, ఉషారాణిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఐడియల్ సంస్థతో తమకు ఉన్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ స్టార్ ఏర్పాటు

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకుని పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో 34 అడుగుల భారీ క్రిస్మస్ స్టార్‌ను శనివారం అర్ధరాత్రి ఏర్పాటు చేశారు. పాతపొన్నూరు క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయం పాస్టర్ డాక్టర్ కనపర్తి ఆశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం క్రిస్మస్ స్టార్‌ను కసుకర్రు రోడ్డు గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ఐలాండ్ సెంటర్‌కు తరలించారు. చీరాల బస్టాండ్ ప్రాంతంలో క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు, దైవ గీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గంపై నిఘా నేత్రం

- స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు యత్నం
- పొన్నూరులో 60 ప్రాంతాల్లో ఏర్పాటు
- గ్రామాల్లోనూ నిఘా నేత్రాలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తుల అనుపానులు తెలుసుకునేందుకు, శాంతి భద్రతలను పర్యవేక్షించే కార్యక్రమంలో భాగంగా పొన్నూరు నియోజక వర్గాన్ని నిఘా నేత్ర పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజవకర్గంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గతంలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పాటు చేశారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీజీఎస్ కేంద్రంతో అనుసంధానమయ్యే విధంగా పట్టణ ప్రధాన కూడళ్లతోపాటు పలు రహదారులపై సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సీసీ కెమెరాలను పూర్తిగా పక్కన పెట్టేశారు. నాట్కో వంటి సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా నిర్వహణ లోపం కారణంగా పూర్తిగా మూలనపడ్డాయి. కెమెరాలు పనిచేయటం లేదని తెలుసుకున్న అసాంఘిక శక్తులు పెట్రేగిపోయారు. పొన్నూరు పట్టణంలో పలు కూడళ్లలో బహిరంగంగా మద్యం తాగే వారు.. ఘర్షణలకు దిగేవారు.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవారు.. మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవారు.. ఇలా పలు కార్యకలాపాలు యథేచ్ఛగా సాగించేవారు. వందలాది సెల్ ఫోన్లు చోరీ జరిగినా, గృహాలలో దొంగతనాలు జరిగినా నేటి వరకు రికవరీ లేదు. పట్టణ ప్రధాన కూడలికి అత్యంత సమీపంలో ప్రధాన రహదారి వెంటే ఉన్న ఓ బంగారు దుకాణంలో కోట్లాది రూపాయల నగలు దుండగులు దోచుకెళ్లినప్పటికీ వారి ఆచూకీ నేటి వరకు లభ్యం కాలేదు, అదే సీసీ కెమెరాలు పలు ప్రాంతాల్లో పెట్టి ఉంటే దొంగలను పట్టుకోవటం సులభతరం అయ్యేది. మరోవైపు ద్విచక్ర వాహనాల చోరీలు అధికమయ్యాయి. గ్రామాల్లో ఆగంతకుల సంచారం అధికంగా ఉన్నప్పటికీ 29 గ్రామాలను పర్యవేక్షించడానికి తగిన పోలీస్ సిబ్బంది లేకపోవటం కూడా ప్రధాన సమస్యగా మారింది. కొండముది వంటి గ్రామంలో రెండేళ్ల క్రితం వరుసగా గడ్డివాముల దహనాలు, పశువుల చావిడులకు నిప్పంటించిన ఘటనలు పదుల సంఖ్యలో జరిగాయి. ఈ ఘటనలు జరిగిన తర్వాత మేల్కొన్న అప్పటి పోలీస్ అధికారులు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో ఈ దురాగతాలకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంను నిఘా పరిధిలోని తీసుకురావాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సంకల్పించారు. పోలీస్ అధికారులతో సమావేశమై ప్రతి రహదారి రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇప్పటికే అర్బన్ పోలీసులు స్వచ్ఛంద సంస్థల సహకారంతో 60 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. మరో 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. అలాగే మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, నిత్యం రాజకీయ వేడి ఉండే గ్రామాల్లో సైతం కెమెరాలను ఏర్పాటు చేయాలని రూరల్ పోలీసులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో ప్రధాన రహదారుల్లో, అంతర్గత రహదారుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిఘా పరిధిలోని నియోజకవర్గాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.



పొన్నూరు పట్టణం ఏరియల్ వ్యూ

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఎన్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ, అధ్యాపకులు దశరథ రామిరెడ్డి, రవికుమార్, రఫీ, సునీత, కళావతి తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములు ఆత్మార్పణ రోజును నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీను, రామకృష్ణ, చెన్నకేశవరావు, సుబ్రహ్మణ్యం, కార్తీ తదితరులు పాల్గొన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కోరారు.

● తెనాలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి చివరకు ప్రాణాలను త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని బోస్‌రోడ్డులో అమరజీవి విగ్రహానికి వైసీపీ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో..

మండలంలోని కొలకలూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చొప్పరప్రీతి గ్రామంలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీహెచ్ వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, పూర్ణచంద్రరావు, గుడివాడ కాంతారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తుపాకుల మణి, హరినాయుడు, అత్తలూరి బ్రహ్మయ్య, వీర మహిళలు పల్లిశెట్టి ఝాన్సీలక్ష్మి, అడుసుమల్లి దుర్గ, టీడీపీనాయకులు పూర్ణచంద్రరావు, బోడపాటి విజయ్‌కుమార్, తోట లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కొల్లిపర మెయిన్‌రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ఆ మహనీయుడి త్యాగఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయ్యిందన్నారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు మునగాల రామలక్ష్మణరావు, చుండూరు వెంకటరత్నం, కాజా ప్రసాద్ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, తదితరులు



కొల్లిపరలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

'అమరజీవి త్యాగంతోనే తెలుగు వారికి గుర్తింపు'

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంతోనే తెలుగు వారికి గుర్తింపు లభించిందని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. మారీసుపేటలోని శ్రీరాములు కాంస్య విగ్రహం వద్ద 72వ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అవమానాలను, అన్యాయాలను ఎదుర్కొనేందుకు 58 రోజులు నిరాహార దీక్ష చేసి అశువులు బాసిన అమరజీవిని ఏ తెలుగువాడు మరిచి పోకూడదన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, బుల్లియ్య, పూర్ణచంద్రరావు, శివకుమార్, రాయప్ప, వీరయ్య పాల్గొన్నారు.



పొన్నూరులో పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పట్టణంలో పొట్టి శ్రీరాముల పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి టి.వెంకట శివరామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కోట రవి, ఎ.వెంకటేశ్వరరావు, ఎల్.పద్మజ, పి.వెంకట సుబ్బారావు, కె.భీమేశ్వరరావు, టి.ఉమామహేశ్వరరావు, ఎం.లక్ష్మి, బి.రోశయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో నివాళులర్పిస్తున్నకాంగ్రెస్ నాయకులు

ఏపీని ఏఐ స్కిల్ హబ్‌గా రూపొందించడమే లక్ష్యం

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పెదకాకాని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ హబ్‌గా రూపొందించడమే లక్ష్యం అని దేశ గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అందులో భాగంగా గూగుల్ సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. దీనికి అనుగుణంగా వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గూగుల్ డెవలపర్స్ గ్రూప్ ద్వారా నిర్వహించే మొదటి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్లింగ్ వర్క్‌షాప్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో విద్యార్థులకు, అధ్యాపకులకు బిల్డ్ ఏఐ అప్లికేషన్స్ అండ్ డిజైన్స్‌పై అవగాహన కలిగించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ వున్నా తెలుగువారు ముందంజలో ఉండేలా భవిష్యత్ తరాల సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు మెరుగైన ఉపాధి అందిపుచ్చుకునేలా కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని అన్నారు. అందులో భాగంగా గూగుల్ సంస్థతో పాటు మరిన్ని సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునే వీలుందని తెలిపారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ దేశంలో తొలిసారి గూగుల్ కోడ్ ల్యాబ్‌ను వీవీఐటీలో నెలకొల్పడం జరిగిందనీ, అదేవిధంగా తొలి గూగుల్ స్కిల్లింగ్ వర్క్ షాప్‌ను వీవీఐటీలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వైస్‌చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు అధునిక సాంకేతికతను అందించడంలో వీవీఐటీ ముందుటుందని, ప్రభుత్వం విద్యార్థులకు మంచి చేసేందుకు తీసుకునే ఏ నిర్ణయానికైనా వీవీఐటీ సహకరిస్తుందని తెలిపారు. ప్రోగ్రామ్ మేనేజర్, డెవలపర్ రిలేషన్స్ గూగుల్ యాక్సిలరేటర్ హెడ్, గూగుల్ ఇండియా, పాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరంగా ఉందని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక పురోగతిని విద్యార్థులకు డెవలపర్స్‌కు అందించడంలో ఈ కార్యక్రమం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. భవిష్యత్ సాంకేతికతను రూపొందించడంలో విద్యార్థులను శక్తివంతం చేసేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు.



వీవీఐటీలో జరిగిన ఏపీ ఏఐ స్కిల్ హబ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

ఆటుపోట్లను తట్టుకుని పోస్టాఫీసుల మనుగడ

పోస్టు మాస్టర్ జనరల్ మూర్తి

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా వచ్చే ఆటుపోట్లను తట్టుకుని పోస్టాఫీసులు మనుగడ సాగిస్తున్నాయని విజయవాడ, విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మూడో సర్కిల్ కాన్ఫరెన్స్ ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన అసోసియేషన్ సభ్యులతో ఆయన మాట్లాడుతూ, పోస్టాఫీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాయని, లాభాలు లేకపోయినప్పటికీ ఉనికిని కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నాయన్నారు. పోస్ట్‌మాన్‌లుగా పదో తరగతిలో ప్రతిభ చూపిన వారిని నియమించడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోగలుగుతున్నారని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. అసోసియేషన్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల కారణంగా తపాల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులు సంక్షేమానికి ఐక్యంగా ముందుకు వెళతామని చెప్పారు. కార్పొరేట్ రంగం కారణంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు సహకారం అందించి తపాల శాఖ, బీఎస్ఎన్ఎల్‌ను కాపాడుకునేందుకు నడుం బిగించాలన్నారు. పోస్టుమాన్ సంఘ సర్కిల్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, జీడీఎస్ సర్కిల్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, గ్రూప్-సి ప్రధాన కార్యదర్శి అనంతకుమార్ పాల్, సంతోష్‌కుమార్ సింగ్, క్యాలీరామ్‌శర్మ, చంద్రశేఖర్, ప్రేమ్‌చంద్, ఎన్‌వీఎస్ నాయుడు, డీఎల్ కాంతారావు, వెంకయ్య, వసంతరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, తారక్‌నాథ్ ప్రసంగించారు.



సభలో మాట్లాడుతున్న పోస్టుమాస్టర్ జనరల్ మూర్తి, వేదికపై సంఘ రాష్ట్ర నాయకులు

కొలకలూరులో తాళాలు వేసిన ఇంట్లో చోరీ

● సీసీ కెమెరాల్లో నిందితుడి కదలికలు

తెనాలి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలకలూరు గ్రామానికి చెందిన వేజెండ్ల శివనాగేశ్వరరావు కుటుంబంతో కలిసి ఢిల్లీలో ఉంటున్నారు. స్వగ్రామంలో ఉన్న ఇంటికి తాళాలు వేసి గ్రామానికి పండుగలు, పంక్షన్లకు మాత్రమే వచ్చి వెళ్తా ఉంటారు. ఆ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా పరిశీలిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. సీసీ కెమెరాల్లో అతడి కదలికలు నమోదు అవుతుండటంతో వెనక్కి వెళ్లి టవల్ వంటిది ముసుగుకప్పుకుని లోపలికి వచ్చి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేశాడు. లోపల బీరువాను తెరచి అందులోకి వెండి వస్తువులను బయటకుతీసి వదిలేశాడు. ఇంట్లో ఏఏ వస్తువులు చోరీకి జరిగాయి అన్న విషయాలపై స్పష్టత లేదు. ఇంటి యజమానులు ఢిల్లీలో ఉండటం వల్ల స్వగ్రామానికి వచ్చి ఇంటిని పరిశీలించి వారు వివరాలు వెల్లడిస్తే గాని స్పష్టత రాదని పోలీసులు చెప్పారు. గ్రామస్థుల సమాచారం మేరకు క్లూస్‌టీంతో చోరీ జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలను సేకరించడం జరిగిందని సీసీపుటేజ్‌లో నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



చోరీకి వచ్చిన వ్యక్తి



సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐలు రమేష్‌బాబు, మల్లికార్జునరావు, రాజ్యలక్ష్మి తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెనాలి డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఆదివారం త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ డీఎస్పీ జనార్ధనరావు పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసపూరిత ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు పంపుతారన్నారు. ఏ బ్యాంకు, రుణ సంస్థలు ఫోన్‌చేసి ఆధార్, పాన్, ఓటీపీలు వంటి వివరాలను అడగవని, అటువంటివి అడిగితే ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లని గుర్తించాలని అన్నారు. సెల్ ఫోన్‌లకు వచ్చే ఇంటర్ నేషనల్ కాల్స్‌ను ఆన్సర్ చేయవద్దని, తెలియని వాట్సఫ్ లింక్‌లను ఓపెన్ చేయద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి లోన్‌ను ఇస్తామని, క్రెడిట్ కార్డు వచ్చిందని ఓటీపీ చెప్పాలని అడుగుతారని అటువంటి వారికి చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా యువతను టార్గెట్ చేస్తున్నారని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం మార్కెట్ వంతెన నుంచి చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వరకు సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు మల్లికార్జునరావు, రాములునాయక్, రమేష్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐలు బ్రహ్మం, రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.




బాలికలకు పాదరక్షలు అందజేస్తున్న రైల్వే సూపరింటెండెంట్ వెంకటరమణ

ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షలు రాయాలి

● రైల్వే సూపరింటెండెంట్ వెంకటరమణ

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రణాళికబద్ధమైన కృషి అవసరమని రైల్వే సూపరింటెండెంట్ టి.వెంకటరమణ చెప్పారు. జేఎంజే కళాశాల స్వధార్ హోమ్‌లో ఆదివారం పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పరీక్షలకు సిద్ధమయ్యే విధి విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 60మంది స్వధార్ విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ చేశారు. పదో తరగతిలో ఈ ఏడాది కొత్త సిలబస్ కావడం వలన ఏ అంశంపై ప్రధానమైన ప్రశ్నలు వస్తాయో అవగాహన కల్పించారు. ప్రతిరోజు తగిన సమయం కేటాయించి ముఖ్యమైన వాటిని నమోదు చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ఉదయమేరి, అచ్యుత సాంబశివరావు, రాజేంద్ర కుమార్‌రెడ్డి, దీప్తి, దుర్గ, హవీల, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష పలకల అర్చన కార్యక్రమాన్ని ప్రారంభించిన బాలస్వామి, ట్రస్ట్ చైర్మన్ వెంకట కృష్ణమూర్తి, రమణయ్య, రామకృష్ణ తదితరులు

లక్ష పలకల పూజకు శ్రీకారం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేట శ్రీ విద్యాపీఠంలో శ్రీ సాలిగ్రామ మఠంట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) లక్ష పలకల పూజలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ తెనాలిలో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే సరస్వతి ఆలయంలో లక్ష పలకల ఆరాధన చేసి స్తూపం ఏర్పాటు చేయాలని సంకల్పం చేశామన్నారు. అందులో భాగంగా లక్ష పలకలు పూజ కైంకర్యంకు భక్తులు తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, పల్లె మనోహర్, గోపు రామకృష్ణ, సామి రమేష్, కొనిజేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారి జీవనోపాధికి తోపుడు బండి

తెనాలి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన యంగ్ జనరేషన్ టీమ్ ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించింది. ఇస్లాంపేటకు చెందిన రమణకు, టౌన్ చర్చి వద్ద విజయమ్మకు తోపుడు బండ్లు అందించి వారి జీవనోపాధికి దోహదపడ్డారు. బండిపై పూలు అమ్ముకుని జీవనోపాధి చేస్తున్నారని టీమ్ అధ్యక్షుడు సాదిక్ చెప్పారు. న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, శివ, నవీన్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండి అందిస్తున్న టీమ్‌సభ్యులు